


నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 36 శుక్రవారం, అక్టోబర్ 31, 2025 , పేజీలు - 12 వెల : 2/-



## ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోదీ

**ముజాఫర్‌పుర్:అక్టోబర్ 30:** బీహారీ ప్రజలు గొప్పగా జరుపుకునే ఛాట్ పూజకు .. యునెస్కో వారసత్వ సంపద గుర్తింపు తీసుకురానున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇవాళ ముజాఫర్‌పుర్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఎంతో సంతోషంగా బీహారీ ప్రజలు ఛాట్ పూజను జరుపుకుంటారని, ఆ పండుగను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తున్నదని, మిగతా2లో...

## రైతులకు వేదన మిగిల్చిన

# తుఫాన్



● అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి ● నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియచేయాలి ● విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి ● వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి ● కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి ● నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సిఎం పర్యటన

**హైదరాబాద్,అక్టోబర్ 30:**ఇది వరి కోతల కాలం.. కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం మిగతా2లో...

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

# జస్టిస్ సూర్యకాంత్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల



2లో

## దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

**జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా సాగింది**

**10శాతం టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన**



**న్యూఢిల్లీ,అక్టోబర్ 30:** అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. మిగతా2లో...

## చంద్రబాబు ముందస్తు చర్యలతో

# నష్టనివారణ

**46 వేల హెక్టార్లలో వరికి నష్టం కలిగింది**

**14 వేల హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు**

**కృష్ణాజిల్లా అవనిగడ్డలో పర్యటించిన డిప్యూటి సిఎం**

**బాధిత రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చిన పవన్ కళ్యాణ్**





**విజయవాడ,అక్టోబర్ 30:** ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మిగతా2లో...

# అజారుద్దీన్ ఎందుకీ అక్కసు

- బిజెపి తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- దేశానికి కీర్తి తెచ్చిన ఘనత అజ్జుదన్న భట్టి
- బిజపి విమర్శలను కొట్టి పారేసిన పిసిసి చీఫ్



**హైదరాబాద్,అక్టోబర్ 30:** మంత్రి వర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవద్దని లేఖలు రాస్తున్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారుడని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచపటంలో మిగతా2లో...



# నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

- అజారుద్దీన్ కోసం ప్రత్యేకం
- రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

**హైదరాబాద్,అక్టోబర్ 30:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ మిగతా2లో...

# జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్,అక్టోబర్ 30:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటు న్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి మిగతా2లో...


## వరంగల్ ముంపు ప్రాంతాల్లో

# పోలీస్ సేవలు



- హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను పంపించండి
- తక్షణ సహాయక చర్యలకు పడవలను పంపించాలి
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం
- సీఎస్, డీజీపీకి ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 30:** వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్య ంలో పోలీసుల సేవలను వినియోగించు కోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా



సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న మిగతా2లో...

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన



**/సిద్దిపేట,అక్టోబర్ 30:** సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. మిగతా2లో...

# దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. జిన్‌పింగ్ తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

# రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అజారుద్దీన్ ఎందుకీ అక్కసు

(మొదటి పేజీ తరువాయి)

నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిగా చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పిసిసి చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దీన్‌ను కేబినేట్‌లోకి తీసుకుంటే బిజెపికి వచ్చిన నొప్పి ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లవి ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)



పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ మూడు జిల్లాల పూర్తిగా జలమయం అయిందని తెలి పారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్న దని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బ తిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్ లో పర్యటిం చాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతులను ఆదుకుం టామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీ యాలకు అతీతంగా రైతాంగా న్ని ఆదుకో వాలని.. ఇక్కడ పర్యటిం చాలన్నారు. కేంద్రం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికా రులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంట లను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయా లని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

• రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి



**హైదరాబాద్,అక్టోబర్ 30:** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷-దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు.

# ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

కానీ తమ ప్రభుత్వం ఛాట్ పూజకు యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తునదన్నారు. ఓట్ల కోసం ఛాట్ ఉత్సవాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ అవమానిస్తున్నదన్నారు. రైల్వేను లూటీ చేసినవాళ్లు.. బీహార్ ప్రాంతాన్ని ఎలా డెవలప్ చేస్తారని అన్నారు. బీహార్‌లో జంగిల్‌రాజ్ నడిచిందని, ఆర్జేడీ గుండాలు షోరూమ్‌లకు వెళ్లి వాహనాలను ఎత్తుకెళ్లినట్లు ఆరోపించారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# చంద్రబాబు ముందస్తు చర్యలతో నష్టనివారణ

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. 'మొంథా' తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా ఉన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తం గా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు.

# వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది.

# నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. s

# జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420

# గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే జారేకు విన్నవించిన పట్టభద్రులు



**చర్చ, అశ్వారావుపేట:** పలు సమస్యలపై దమ్మపేటకు చెందిన పట్టభద్రులు కలిసి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వినతిపత్రం అందచేశారు. గురువారం గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దమ్మపేట గ్రామ పట్ట భద్రులు కలిశారు. దమ్మపేటలో ప్రధానంగా జూనియర్ కాలేజీ, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ వంటి వృత్తి విద్యా కోర్సులకు సంభందించిన కాలేజీల ఏర్పాటు చెయ్యాలని కోరారు. డ్రెయినేజీలో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వృద్ధి చెంది విషజ్వరాల భారిన పడుతున్నామని అన్నారు. నూతన గ్రంధాలయానికి స్థలం కేటాయించినందున ఆధునిక టెక్నాలజీ, వసతులు కల్పించాలని కోరారు. గ్రంధాలయ నిర్వహణలో గ్రామ పట్టభద్రుల భాగస్వామ్యం ఉండేటట్లు చూడాలని అన్నారు. రద్దీ ప్రాంతంలో రోడ్లపై వ్యాపారుల ఆక్రమణ తొలగించాలని, హిందూ స్మశాన వాటికలో కాంక్రీట్ ఫ్లోర్ నిర్మాణం, స్మశానంకు పూర్తి స్థాయిలో ప్రహరీ, డ్రైనేజ్‌పై ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. రామాంజనేయ కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ చేసే ఏర్పాటు చేయాలని అన్నారు. నిరుపయోగంగా ఉన్న షాదీఖానాను ఉపయోగంలోకి తీసుకురావడం పై దృష్టిసారించి పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి చేయవలసిన పనుల పై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పట్ట భద్రులు ఆంగోతు బాలాజీ, గట్ల నాగరాజు, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, వనమా శ్రీనివాసరావు, పానుగంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి సొంతింటి కల నెరవేర్చటం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**చర్చ, అశ్వారావుపేట:** ప్రజలందరికీ సొంత ఇంటి కలను నెరవేర్చడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగోత్ నాగు, భార్గవి దంపతుల కొత్త ఇంటిని ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సొంతిళ్ళు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఏర్పాటు చెయ్యడమే తన లక్ష్యం అని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు పోశారు కల్వర్ట్ మరిచారు



**చర్చ, అశ్వారావుపేట:** ఎన్నో లక్షలు ఖర్చుపెట్టి ప్రభుత్వ నిధులతో అంతర్గత రహదారి పనులు అయితే అంతంత మాత్రం చేశారు కాని.... నువ్వాదరినా నేనీదరిన అన్నట్టు ఉంది అధికారుల పనితీరు. అశ్వారావుపేట మున్సిపాలిటీగా అవతరించకు ముందు పంచాయతీగా ఉన్నప్పటి పాలకవర్గ హయాంలో పేటలోని రామాలయం నుండి కోనేరు బజారుకు వెళ్లే దారిలో వేసిన సిమెంట్ రోడ్డుకి మధ్యలో కొంతభాగం రోడ్ వెయ్యకపోవడంతో ఆదారిలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రోడ్డు మధ్యలో కల్వర్ట్ కట్టవలసి ఉంది కాని ఆప్రాంతంలో కల్వర్ట్ కట్టకుండా వదిలేసారని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేసి ఎన్నో సంవత్సరాలు అవుతున్నప్పటికి డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఒక వైపు వెళ్లే నీరు మరొకవైపుకు వెళ్ళడానికి ఆ మధ్య భాగం వదిలినట్టు చెప్తున్నప్పటికి నేటికీ ఆ ప్రాంతంలో కల్వర్ట్ కట్టకపోవడం వలన పాదాచారులకు, వాహనదారులకు చాలా ఇబ్బందికారంగా మారింది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు కాని స్థానిక నాయకులు కాని పట్టించుకుని రోడ్డు వెయ్యకుండా వదిలేసిన ప్రాంతంలో వెంటనే కల్వర్ట్ నిర్మించి మాకష్టాలు తొలగించాలని స్థానికులు వేడుకొంటున్నారు.

# గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకున్న పోలీసులు

**- నిందితుల్లో ఒకరు మైనర్**



**చర్చ, సత్తుపల్లి:** గంజాయి విక్రయిస్తున్న ఒకరిని, సేవిస్తున్న ఇద్దరిని సత్తుపల్లి పోలీసులు పట్టుకున్నారు. కాగా వీరిలో ఒక మైనర్ ఉండటం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన పెయింటర్ కువ్వారపు సతీష్ కుమార్, మరో మైనర్ బాలుడితో కలిసి దురలవాట్లకు అలవాటుపడి గంజాయికి బానిసలయ్యారని, వీరు ఆంధ్ర%-%ఒరిస్సా బోర్డర్‌లో గంజాయి అమ్ముతారన్న విషయం తెలుసుకుని ఆవులపాక గ్రామానికి వెళ్ళి అక్కడ గంజాయి విక్రయించే భగవాన్ వద్ద అరకిలో గంజాయిని కొనుక్కొని వచ్చి ఇద్దరూ సేవించారని పోలీసులు తెలిపారు. గురువారం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఉన్న వైకుంఠ ధామం వద్దకు వెళ్లి గంజాయిని సేవించి, మిగిలిన గంజాయిని విక్రయించేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పోలీసుల వాహనాలు తనిఖీలో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, సత్తుపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టి.శ్రీహరి తెలిపారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో





**- నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ పవర్**

**నల్గొండ జిల్లా చర్చ ప్రతినిధి** నల్లగొండ జిల్లా పట్టణ కేంద్రంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీనీ ప్రారంభించి పాల్గొన్న జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్‌లిఅమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా పట్టణ కేంద్రంలోని యన్.జి కళాశాల నుండి జిల్లా ఎస్పీ గారు సైకిల్ ర్యాలీ ప్రారంభించి ర్యాలీలో పాల్గొని రామగిరి మీదుగా క్లాక్ టవర్ వరకు పోలీసు సిబ్బంది,పట్టణ యువకులు, విద్యార్థులతో కలిసి అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.పోలీస్ విధి నిర్వహణలో అమరులైన అమరవీరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామనీ, వారి త్యాగాల గుర్తుగా అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నామని అన్నారు.దీనిలో భాగంగా ఈ రోజు పట్టణ కేంద్రంలో పోలీస్ అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన వారి ఆత్మ శాంతి కలగాలని అన్నారు. జిల్లా పోలీస్ ప్రజా రక్షణే ద్యేయంగా రాత్రనక, పగల నక అనుక్షణం శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి, ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, సిఐలు రాఘవరావు, రాజశేఖర్ రెడ్డి,మహా లక్ష్మయ్య శ్రీను నాయక్ ఆర్ ఐ లు సంతోష్, శ్రీను,సూరప్ప నాయుడు, హరిబాబు ఎస్సైలు సైదులు, శంకర్, గోపాల్ రావు,వీరబాబు, శ్రావణి,మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు టార్పాలిన్లు కచ్చితంగా అందజేయాలి

**- సన్నరకం ధాన్యం మిల్లర్లు తీసుకోవాలి**
**- వర్షం తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలి**
**- వరి కోతలు వాయిదా వేసుకోవాలి**
**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- జిల్లెల్ల గ్రామంలో ప్యాక్స్ కొనుగోలు కేంద్రం పరిశీలన**





**చర్చ:- కరీంనగర్. సిరిసిల్ల**
అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కచ్చితంగా టార్పాలిన్లు అందజేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంఛార్జి కలెక్టర్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, వడ్ల తేమ శాతం పరిశీలించి, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో రైతులు వరి కోతలు మరో రెండు రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అన్ లోడ్ చేసుకునేలా చూడాలని, సన్నరకం వడ్లను కూడా తీసుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష


**- జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ కార్యాచరణ అమలు**
**- రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై నిర్వహించిన సమావేశం లో పాల్గొన్న జిల్లా కలెక్టర్**
**- జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.**





**చర్చ :- కరీంనగర్. పెద్దపల్లి** గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ, డి.సి.పి కరుణాకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి.వనజ లతో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సుల్తానాబాద్, పెద్దపల్లి, బసంత్ నగర్, ఎన్.టి.పిసి, గోదావరిఖని 1 టౌన్ లో అధికంగా ప్రమాదాలు జరిగే 28 హాట్ స్పాట్ లను గుర్తించి 27 లక్షలతో ఎల్.ఈ.డి. హై మాస్ లైట్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బసంత్ నగర్ లో మరో 2 చోట్ల 5 లక్షల రూపాయలతో హై మాస్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పట్టణంలో 15 లక్షల ఖర్చుతో నూతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని అన్నారు. రోడ్డు పై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అవసరమైన మేర స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు పై పశువులు విడిచిపెట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ 10 వేల రూపాయల జరిమానా విధించాలని, పశువులను గోశాలలకు తరలించాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్.కే.ఆర్ సిబ్బంది మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పెద్దపల్లి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన మేర రొడ్డు విస్తరణ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. రొడ్డు విస్తరణ సజావుగా జరిగేలా మున్సిపల్ అధికారు చొరవ తీసుకుని సంబంధిత వీధి వ్యాపారులను ఒప్పించాలని అన్నారు. డివైడర్ లను పరిశీలించి అక్కడ ప్రమాదాల జర్గకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం నగరంలో అవసరమైన చోట సిసి కేమేరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం జరిగిన ప్రమాదాలపై రిపోర్ట్ అందించాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో రోడ్డు స్ట్రిప్స్ , రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. టౌన్ లో ట్రాఫిక్ నియంత్రణ కోసం యూ టర్న్ ల పై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత ప్రమాణాల పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో అధికంగా ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు ఉండాలని అన్నారు. హిట్ అండ్ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదనలు త్వరగా పంపాలని కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లాలోని రహదారి పక్కన ఉన్న పిచ్చి మొక్కల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లారీలు, ట్రాక్టర్ లు, భారీ వాహనాలు, కార్లకు ముందు వెనుక తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్ , పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీలు రమేష్ ,కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి , సిఐ, ఎస్ఐ లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# వర్షాల వల్ల కలిగిన నష్టంపై సమీక్షించిన కలెక్టర్






**చర్చ :- కరీంనగర్** వర్షాల వల్ల కలిగిన పంట, ఆస్తి నష్టం, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వర్షాల కారణంగా 8 పశువులు మరణించాయని, వీటి యజమానులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు ఏమైనా ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిహారం అందజేయాలని అన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా సుమారు 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లుగా సమాచారం ఉందని, రైతు వారీగా తడిసిన ధాన్యం వివరాలను సేకరించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పూర్తిస్థాయిలో టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ తడవకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే పత్తి కొనుగోలు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాల పట్ల రెవెన్యూ, పోలీస్, పంచా యతీ కార్యదర్శులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో నీరు పారుతున్న కల్వర్టుపై నుండి వాహనాలు, మనుషులు వెళ్లకుండా చూడాలని తెలిపారు. చెరువులు, కుంటల నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తం కావాలని తెలిపారు. నగరంలో నీరు నిలిచిన చోట దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అడి షనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**- శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**
**- చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రజలు**









**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో దమ్మపేట మండలం గండుగులపల్లిలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరంకు ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి ప్రారంభ దశలో గుర్తిస్తే సులభంగా నయం చేయవచ్చునని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి శిబిరాలు అత్యంత అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, బసవతారకం కాన్సర్ ఆసుపత్రి వైద్యులు సేవా ధృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమైన విషయం అన్నారు. శిబిరంలో స్థన క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి రోగాలకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు అత్యాధునిక పరికరాలతో ఉచితంగా నిర్వహించారు. వైద్య నిపుణులు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య అవగాహన కల్పిస్తూ ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయవ ద్దని, ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి స్క్రీనింగ్ చేయిం చుకోవాలి అని సూచించారు. గండుగులపల్లి గ్రామానికి మాత్ర మే కాకుండా నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట , ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపరెడ్డిపల్లి, గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో శిబిరానికి తరలివచ్చి వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్య బృందంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొనగా, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు సహకరించారు.

# గోదావరిఖని :రామగుండం అభివృద్ధికి 50 కోట్లు మంజూరు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**




**రామగుండం** నగర అభివృద్ధికి ప్రభుత్వం మరో 50 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ గుండం నగరం కార్పొరేషన్ పరిధిలో రెండు అభివృద్ధి పనులు చేపట్టేందుకు యూ.ఐ. డి.ఎఫ్ పథకం క్రింద ప్రభుత్వం ఇటీవలే 50 కోట్ల రూపాయలకు బడ్జెట్ విడుదల చేసి ందని అన్నారు. నేషనల్ హౌసింగ్ బ్యాంకు 40 కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు విడుదల చేస్తుందని, ఈ పనులకు మార్చి 2026 నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష




**చర్చ, గోదావరిఖని (అక్టోబర్ 30):** రామగుండం ట్రాఫిక్ సి.ఐ బి. రాజేశ్వరరావు ఆద్వర్యంలో నిర్వహించిన డ్రంక్ %డ% డ్రైవ్ లో పట్టుబడిన నలుగురిని గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా ముగ్గురికి ఆరు వేల జరిమానా విధించారు. రాయమల్లు అనే వ్యక్తి రెండవసారి పట్టుబడగా మూడు రోజుల జైలు శిక్ష విధించగా కరీంనగర్ జిల్లా జైలుకు తరలించి నట్లు ట్రాఫిక్ సి.ఐ రాజేశ్వరరావు తెలిపారు.

# విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**- రామగుండం వైద్య కళాశాలలో నిర్వహించిన వైట్ కోట్ సేర్మనీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**








**చర్చ :- కరీంనగర్. పెద్దపల్లి**
వైద్యవృత్తిని ఎంచుకున్న విద్యార్థులు ఎటువంటి విపత్కర పరిస్థితి లోనైనా ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం రామగుండంలోని సింగరేణి వైద్య కళాశా లలో నిర్వహించిన వైట్ కోట్ సేర్మనీలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జ్యోతి ప్రజ్వలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వైద్య కోర్సును ఎంపిక చేసుకుని మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలో రామగుండం సింగరేణి వైద్య కళాశాల వద్ద మెరుగైన వసతులు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సింగరేణి వైద్య కళాశాలలో కమిట్మెంట్ తో పని చేసే ఫ్యాకల్టీ అందుబాటులో ఉందని ఇక్కడ విద్యార్థు లకు మంచి టీచింగ్ అందుతుందని అన్నారు. వైద్యులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా నిర్దేశించుకున్న లక్ష్యాలను వైట్ కోట్ సేర్మనీ గుర్తు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. గత 2.5 సంవత్సరాలుగా మీరు చేసిన కృషి ఫలితంగా ఈ రోజు వైట్ కోట్ సర్మనీ లో పాల్గొంటున్నారని, ఇక్కడ విద్యార్థులు వివిధ ప్రాంతాలు, సామాజిక ఆర్థిక పరిస్థితుల నుంచి వచ్చిన వారు ఉన్నారని, ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన కృషి ఉందని అన్నారు.సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ గత 4 సంవత్సరాలుగా ఉన్నతమైన సేవలు అందిస్తుందని, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్య కళాశాల గా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే 4,5 సంవత్సరాలు మీ జీవితంలో చాలా కీలకం కాబోతుందని, అనేక సార్లు నిరుత్సాహపడే పరిస్థితులు రావచ్చని, ఒత్తిడి పెరగవచ్చని, ఎటువంటి పరిస్థితుల్లోనూ నమ్మకం ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని, గత రెండున్నర సంవత్సరా లుగా చూపించిన ధైర్యం భవిష్యత్తులోనూ కొనసాగించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. నరేందర్, డా. లావణ్య, డా. ప్రదీప్ చంద్ర,డా. భాను లక్ష్మీ,డా. ఫరీద్,డా. అనూష,డా. రాజు,డా. శిరీష , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ పేరుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆపకండి: న్యూడెమోక్రసీ



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాలు ఇచ్చి ఇప్పుడు రిజిస్ట్రేషన్ లేవని బిల్లులు ఆడపాన్ని నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల పిడి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం పీడీ నజారయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ పాల్వంచ పట్టణంలోని వనమా కాలనీ, ఇందిర కాలనీ, వెంగళరావు కాలనీ, వికలాంగుల కాలనీ, శివనగర్, హమాలి కాలనీ, నెహ్రూ నగర్ మిగతా పట్టణంలోని కాలనీలలో గత రెండు నెలల కిందట ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. తాతల కాలం నుండి ఆయా కాలనీలలో నివాసం ఉంటూ, ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు, పంపు బిల్లులు చెల్లిస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇస్తే ప్రజలందరూ సంతోషంగా ఉన్న ఇళ్లు కూలగొట్టుకొని నిర్మాణాలు ప్రారంభించేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ సమయంలో ఇది ఏజెన్సీ ప్రాంతం, రిజిస్ట్రేషన్లు లేవు అనే నెపంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆపివేయడంతో లబ్ధిదారులందరూ కన్నీరు మున్నీరై విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల పట్టా ఇచ్చే సమయంలో లేని నిబంధనలు ఇల్లులు కూలగొట్టుకుని రోడ్డు మీద పడ్డాక గుర్తుకొచ్చాయా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పాత పద్ధతిలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ముగ్గులు పోయించిన వాటికి బిల్లులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పట్టణ నాయకులు ఎల్.నరేష్, లబ్ధిదారులు కొమరం మల్లేష్, మోటం మహేష్, వెంకట్, శాంసన్, అంజలి, విజయలక్ష్మి, సతీష్, సాగర్, జీవన్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలన

**- నల్గొండ జిల్లా కలెక్టర్ త్రిపాటి**





**నల్గొండ జిల్లా చర్చ ప్రతినిధి**
గురువారం ఆయన హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు , ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని మంత్రులు ,జిల్లా కలెక్టర్లు ,ఎస్పీలు,జిల్లా అధికారులతో తుఫాను ప్రభావం పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది, దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నా ఇది వరి కోతల కాలం అయినందున అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలి.అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలి .రోడ్లపై బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వే ల వద్ద, దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలి. ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలి. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలి.అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి .జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలపాలి. వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.ప్రాజెక్టుల ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.ముందు జాగ్రత్త చర్యగా అన్ని ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టుల వద్ద అందుబాటులో ఉంటూ ప్రాజెక్టుల్లో కొద్ది మొత్తంలో ఖాళీగా ఉంచుకోవాలి. పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదు. తుఫాను ప్రభావిత జిల్లా ఇంచార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి.క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలి. వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి .ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇన్చార్జిలను నియమించాలి. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. వర్షాల దృష్ట్యా పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, తదితరులు మాట్లాడారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**- సిపిఎం ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**




**చర్చ, సత్తుపల్లి:** అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన పేదలు సిపిఎం ఆధ్వర్యంలో గురువారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీసభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కాకర్లపల్లి గ్రామ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను సింగరేణి మట్టితో పూడ్పించి పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలన్నారు. గ్రామంలో ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఇరుకు గదుల్లో జీవనం సాగిస్తు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేక పర్యాయాలు వినతి పత్రాలు ఇచ్చిన నేటికి సమస్యను పరిష్కరించలేదన్నారు. బోడు కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. గ్రామంలోనిరుపయోగంగా ఉన్న కోనేరు (నీటి కుంట)ను ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పైన తెలిపిన సమస్యలు పరిష్కారం కొరకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కు వినతిపత్రం అందించారు. సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సిపిఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావ్, ఐద్వా డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, పార్టీ మండల కమిటీ సభ్యులు అయినంపూడి సనందన్ రావు, కువారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, బెజవాడ లక్ష్మినారాయణ, కిష్ట లక్ష్మి , రజియా, యాకుబ్ పాషా, వారాల కుమారి, కొనపాకుల రాజు, బొమ్మన బోయిన భాగ్యలక్ష్మి, ఎర్ర గొర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల కలిగిన నష్టంపై సమీక్షించిన కలెక్టర్




**చర్చ :- కరీంనగర్** వర్షాల వల్ల కలిగిన పంట, ఆస్తి నష్టం, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వర్షాల కారణంగా 8 పశువులు మరణించాయని, వీటి యజమానులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు ఏమైనా ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిహారం అందజేయాలని అన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా సుమారు 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లుగా సమాచారం ఉందని, రైతు వారీగా తడిసిన ధాన్యం వివరాలను సేకరించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పూర్తిస్థాయిలో టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ తడవకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే పత్తి కొనుగోలు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాల పట్ల రెవెన్యూ, పోలీస్, పంచాయతీ కార్యదర్శులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో నీరు పారుతున్న కల్వర్టుపై నుండి వాహనాలు, మనుషులు వెళ్లకుండా చూడాలని తెలిపారు. చెరువులు, కుంటల నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తం కావాలని తెలిపారు. నగరంలో నీరు నిలిచిన చోట దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# తప్పులను ముందుగానే నివారించడమే నిజమైన విజిలెన్స్

**- సింగరేణి విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో విజిలెన్స్ డీజీ శ్రీమతి శిఖా గోయల్**

**చర్చ ,గోదావరిఖని (అక్టోబర్ 30)** ప్రతీ వ్యక్తి కేవలం వృత్తి జీవితంలోనే కాకుండా నిత్య జీవితంలోనూ నీతి, నిజాయతీల అత్యున్నత ప్రమాణాలను పాటించినప్పుడే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడమే కాకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడం సాధ్యమవుతుందని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విజిలెన్స్ వారోత్సవాలను కేవలం వారం రోజులకు పరిమితం చేయకుండా అన్ని రోజులు కూడా నిబద్ధతతో పనిచేయాలన్నారు. నీతి, నిజాయతీ, పారదర్శకత పాటించడం వల్ల కష్టాలు మాత్రమే మిగులుతాయని, పనులు పూర్తి కావన్న అపనమ్మకాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతీ అంశాన్ని మానవీయ కోణంతో చూడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పౌరులకు పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విజిలెన్స్ అంటే ప్రతీ ఒక్కరినీ నేరస్థులుగా చూడటం, నేరస్థులను పట్టుకోవడం కాదని, నేరం జరగకుండా, ఎవరూ నేరం చేయడానికి సిద్ధపడకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే విజిలెన్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నిజాయతీగా పనిచేసిన వారి గొప్పతనం గురించి సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఆత్మ సంతృప్తి కోసం అంతరాత్మను వంచించుకోకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించే అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి 136 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను, సింగరేణి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపడుతున్న విస్తరణ ప్రణాళికలను, సింగరేణిలో మహిళా సాధికారత కోసం చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం శిఖా గోయల్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, క వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అమ్మిందట

**- పహాణిలో కెక్కిన భూమి**
**- నిజం తెలిసేదెలా**
**- జనం టెన్షన్ తొలగేదెలా**
**- జగిత్యాల లో జోరుగా చర్చ**




5 రూ. Rs.5 भारत INDIA पाँच रुपये FIVE RUPEES
22-8-2012.
రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపబడు

సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6 క్రింద సమాచారం కొరకు దరఖాస్తు
తేది: 21/8/2012
ప్రజా సమాచార అధికారి,
జగిత్యాల పట్టణ మున్సిపల్ కమీషనర్
కార్యాలయము జగిత్యాల గార్కి

సమాచారము కొరకు విన్నపము.

సమాచార హక్కు 2005 సెక్షన్ 6 (1) ప్రకారము విషయాలను సమాచారాన్ని సెక్షన్ 7 (1) ప్రకారము వీలైనంత త్వరగా 30 రోజుల్లో సెక్షన్ 2 (జె) (11) ప్రకారము ప్రతి పేజిపై రబ్బరు ముద్ర సంతకము చేసి తెలుగులో లిఖిత పూర్వకముగా నా చిరునామకు పంపగలరు.

1). సర్వే నెం. 138 అ శివారు జగిత్యాల 1955 నుండి 1958 చెసాల పహాణిలో 13-19 గుంటల భూమి జగిత్యాల మున్సిపల్ లోకల్ ఫండ్ ద్వార పట్టేదారు నుంచి జగిత్యాల మున్సిపల్ వాండ్లు మున్సిపల్ పేరు మీద ఖరీదు చేసినట్లు రికార్డు చూపుతున్నది.
2). సర్వే నెం. 138అ లో 13-19 గుంటల భూమి దాని యొక్క హద్దులు, మరియు జగిత్యాల మున్సిపాల్టికి వచ్చు ఆదాయము మరియు సదరు భూమిలో ఎలాంటి నిర్మాణము ఉన్నది తెలుపగలరు.
3). సదరు భూమి ప్రస్తుతము ఎలాంటి పొజిషన్ ఉన్నది, ప్రస్తుతము అట్టి భూమి నుండి ఎలాంటి ఆదాయము వచ్చుచున్నది తెలుపగలరు.
4) ఒక వేల అట్టి భూమి ఇతరులకు లీజు పద్దతిలో ఇచ్చినార తెలుపగలరు.
5) అట్టి భూమి ఇతరుల వలన అక్రమణ (భూ కబ్జా) అన్యాకాంతము అయినచో తెలుపగలరు.
6) అట్టి భూమి ఇతరులు అక్రమించినచో అట్టి వారి వివరములు మరియు అక్రమించిన భూమి ఎంత తెలుపగలరు.
7) మరియు జగిత్యాల మున్సిపాల్టికి చెందిన ఇతర భూములు ఎన్ని సర్వే నెంబరులో ఎంత విస్తీర్ణములో ఉన్నది. ఏ ప్రాంతములో ఉన్నది తెలుపగలరు.
8). పై సమాచార నిమిత్తము ఫీజు 10/- రూపాయలు విలువగల కోర్టు ఫీజు స్టాంపు అతికించనైనది.
9). ఇట్టి దరఖాస్తు వెంట 1955-1958 చెసాల పహాణి కాపీని జతపర్చనైనది.




**చర్చ, జగిత్యాల,(అక్టోబర్ 30)** జగిత్యాల కొత్త బస్టాండ్ లోని దారం వీరమల్లయ్య ప్రాపర్టీ పై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేప్పిన మాటలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఎక్కడ చూసినా ఇదే అంశం పై జగిత్యాల జనం చర్చించుకోంటుండగా ప్రజల నుంచే మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. 1955-58 పహాణి లో మున్సిపల్ ద్వారా కొనుగోలు చేసినట్లు రికార్డుకు ఎక్కినట్లు సమాచారం. ఈ సమాచారాన్ని ఓ పౌరుడు సమాచార హక్కు చట్టం ద్వారా 22/8/2012 లోనే సేకరించినట్లు సమాచారం. ఈ రికార్డుకు ఎక్కిన కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ప్రభుత్వ యంత్రా ంగం ఒక ప్రణాళిక ప్రకారం తన అధికారాలను, విధులను వికెంద్రికరిస్తూ వస్తున్నట్లు కొందరు పేర్కొంటున్నారు. అలాంటి నేపథ్యంలో మున్సిపల్ ఈ భూమిని విక్రయించే పరిస్థితులు ఎందుకు వచ్చాయాన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. విభిన్న పరిస్థితుల్లో ప్రభుత్వమే ఈ భూమిని విక్రయానికి పెడితే ప్రభుత్వ ఉత్తర్వులు తప్పకుండా ఉంటాయని, తప్పనిసరిగా పత్రికా ప్రకటన వేలువడే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఆ వేలం సమయంలో కొందరైనా కొనుగోలులో పాల్గొనే ఉంటారని ఆ రికార్డ్ మున్సిపల్లో ఉండొచ్చునన్న కొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాకాకుండా కిభాలా ఒప్పందం క్రింద మున్సిపల్ నుంచి కొను గోలు చేసి పహాణి కి ఎక్కించుకొని ఉండొచ్చని మరికొందరు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రతి సబ్జెక్టును మంచి పట్టున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి అదేదో సినిమాలో చిన్న తీగను పట్టుకొని లాగితే నిజం వెలుగు చూస్తుందన్న తరహాలో గుంజిన ఒక తీగ ఎందరికి చుట్టుకొంటుందోనన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పట్టాడంటే ఓ పట్టాన వదలడు జీవన్ రెడ్డి అంటూ విద్యావంతులు, రాజకీయ విశ్లేషకులు చర్చించుకోవడం కనిపించింది.

# సిద్దిపేట కలెక్టర్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్

**- అక్కన్నపేటలో ఇద్దరు గల్లంతుపై ఆరా**
**- ఎస్డీఆర్ఎఫ్ టీంలను పంపి గాలింపు చర్యలు చేపట్టాలని కోరిన కేంద్ర మంత్రి**




**చర్చ :- కరీంనగర్** రాత్రి కురిసిన వర్షానికి హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి చెరువులో ఇద్దరు (భార్యభర్తలు) గల్లంతయ్యారనే సమాచారం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేశారు. ఆ ఇద్దరి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ భార్యాభర్తలని వారి బైక్ లభ్యమైందే తప్ప ఆచూకీ తెలియలేదని కలెక్టర్ వివరించారు. వెంటనే ఎస్డీఆర్ఎఫ్ టీంలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో అవసరమైతే అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. స్థానిక బీజేపీ శ్రేణులు సైతం సహాయక చర్యల్లో పాల్గొనాలని, వర్ష బాధిత ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

# సమస్యలు పరిష్కరించాలంటూ







**- ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్టు కార్మికుల దర్నా**

**చర్చ ,గోదావరిఖని(అక్టోబర్ 30).** రామగుండం ఎరువుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని ప్లాంట్ ఎదుట వందలాది మంది కార్మికులు ఆందోళనకు దిగారు. కార్మికులకు సంబంధించి వేతనాలు, అలవెన్సులు, బోనస్ ఇవ్వాలని రెండో రోజు విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. గత కొంతకాలం నుంచి చట్టబద్ధమైన హక్కులను కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని కార్మిక నాయకులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్ ఎఫ్ సి ఎల్ మజ్దూర్ యూనియన్ నాయకులు అంబటి నరేష్ మాట్లాడుతూ కర్మాగారంలో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలు అందక దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. చాలీ చాలని వేతనాలతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా న్యాయపరమైన హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకుంటే తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మ్నొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షం నేపథ్యంలో వరద నీరు నిలిచిన ప్రాంతాలను గురువారం రోజు కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ సందర్శించారు.

**కరీంనగర్** కరీంనగర్ లో పలు ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిని అధికారులతో కలిసి తనిఖీ చేసి






పరిశీలించారు. వరద నీటి తొలగింపు పై అధికారులు డిజాస్టర్ సిబ్బందికి సలహాలు సూచనలు చేసి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా రాంనగర్ తో పాటు కట్ట రాంపూర్, మంచిర్యాల చౌరస్తా, వి పార్కు ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండ శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. నగరంలో పలు చోట్ల స్టాం వాటర్ డ్రైనేజీ సమస్యతో వరద నీరు సులువుగా వెల్లడంలో తలెత్తే సమస్యలను కూడ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ డిజాస్టర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలి సీఎం రేవంత్ రెడ్డి

**- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు**
**- తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి**
**- మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**
**- ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు**
**- 24ఐ7 అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉండాలి**
**- మొంథా తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాంఫిడెన్స్**






**కరీంనగర్:** మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారి ఇంచార్జిగా పెట్టాలని, ధాన్యం కొనుగోలు చేయడం, అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవడం, ధాన్యం తరలింపు, అవసరమైతే స్థానికంగా ధాన్యం స్టోర్ చేయడం వంటి పనులు చేపట్టాలని అన్నారు. ప్రతి రోజు ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి కలెక్టర్ కు క్షేత్రస్థాయి పరిస్థితులపై రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్రతి కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి చాలా కీలకమని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి క్షేత్ర స్థాయిలో పని చేయాలని అన్నారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న రోడ్ల వద్ద వాహనాల రాకపోకలు నిలిపి వేయాలని అన్నారు. ఉదృతంగా ప్రవహించే వాగులు, నీటి వనరుల సమాచారం తెలుసుకొని, వాటికి సమీపంలో ఉన్న రోడ్లు, వంతెనలపై రాకపోకలను నిలిపివేయాలని, దీని కోసం స్థానిక పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు పడటం వల్ల తీవ్రంగా నష్టం జరిగిందని అన్నారు. పంట కోతల సమయంలో ఇలాంటి తుఫాన్ రావడం దురదృష్టకరమని, రైతులకు మొంథా తుఫాన్ తీవ్ర ఆవేదన కలిగించిందని సీఎం తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు చేయాలని, ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ పని చేయాలని అన్నారు. వరదల నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్, ఇతర పరికరాలు ఫీల్డ్ లో సిద్ధం పెట్టుకోవాలని, విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ లు సన్నద్ధం చేయాలని, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. తుఫాన్ వల్ల ప్రాణ నష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని అన్నారు. డిజాస్టర్మేనేజ్మెంట్ యాక్ట్ క్రింద అవసరమైతే ఫంక్షన్ హాల్ లను వినియోగిస్తూ పంటలను స్టోర్ చేయాలని అన్నారు. ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అవసరమైన జిల్లాలకు తరలించాలని అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో కలెక్టరేట్ లలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అక్కడ వారికి అవసరమైన వైద్యం, ఆహారం, ఇతర ఏర్పాట్లు చేయాలని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా విద్యుత్ సమస్యలు రాకుండా అవసరమైన చర్యలు డిస్కం అధికారులు తీసుకోవాలని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న 33/11 కేవి సబ్ స్టేషన్, 33 కేవి, 11 కేవి లైన్లను ఇప్పటికే 75 శాతం వరకు మరమ్మత్తు చేసి సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్లు అందుబాటులో ఉన్న నిధులు వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అధికంగా అందుబాటులో పెట్టాలని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల అంచనాల కంటే రెట్టింపు వర్షాలు పడ్డాయని, రైతులు తీవ్రంగా నష్ట పోయారని అన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో వెళ్ళి పంట నష్టం ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యం ఈ రోజే వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలో లెవల్ కల్వర్ట్ దగ్గర పోలీసు భద్రత ఏర్పాటు చేసి ప్రయాణాలు అడ్డుకోవాలని అన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు .దేవాదాయ శాఖ మంత్రి వర్యులు కొండ సురేఖ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రజల ప్రాణాల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుందని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశామని అన్నారు. పధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. మరో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుఫాన్ కారణంగా వచ్చిన భారీ ఆస్తి నష్టం నేపథ్యంలో ప్రజలకు అండగా నిలిచేలా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ సంబంధించి దెబ్బతిన్న రోడ్లు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మత్తులు చేసి వాహనాల రాకపోకలను వీలైనంత మేరకు పునః ప్రారంభించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న కాల్వలు, తెగిపోయిన చెరువులు, మీడియం ప్రాజెక్టుల నష్టం అంచనాలను తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సిపి లతోపాటు అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్,

# అంబేద్కర్ నగర్ చుట్టూ సింగరేణి అసంపూర్తి పనులు

**- సింగరేణి నిధులు ఇవ్వక కాంట్రాక్టర్ల ఫిరాయింపు.**
**- ప్రారంభించిన పనులకు మోక్షం ఎన్నడు.**
**- నిరీక్షణలో కాలనీవాసులు**





**చర్చ, సత్తుపల్లి:** సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ప్రధాన గ్రామమైన సత్తుపల్లి మండలం కిష్టారం అంబేద్కర్ నగర్ కాలనీలో ప్రజల త్రాగునీటి సమస్య పరిష్కరించడానికి వాటర్ ప్లాంట్,శుభకార్యాలకు ఇబ్బందులు కలగకుండా కమ్యూనిటీ హాల్,వర్షాకాల సమయంలో వరదలకు ఇల్లు మునుగుతున్నాయని అర్జీలు పెట్టుకుంటే డ్రైనేజీ నిర్మాణ పనులు సింగరేణి సంస్థ చేపట్టింది.పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి పురోగతి లేదు.పనుల విషయమై కాంట్రాక్టర్లను ఆరా తీయగా సింగరేణి సంస్థ తమకు నిధులు కేటాయించడం లేదని సొంత నిధులతో పనులు పూర్తి చేయడం తమకు వీలు కాదని పిరాయిస్తున్నారు.సింగరేణి కాలుష్యంతో దిన దిన గండంగా జీవిస్తున్న కాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో సింగరేణి సంస్థ నిర్లక్ష్యం వహిస్తుందని,ప్రారంభించిన పనులకు మోక్షం ఎప్పుడుఅని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రారంభించిన పనులను తక్షణమే పూర్తిచేసి ఉపయోగంలోనికి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# తుది దశలో ఉన్న ఇండ్లను పూర్తి చేయాలి

**- గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి**
**- ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటిదాకా దాదాపు రూ. 49 కోట్ల 85 లక్షల ఆర్థిక సాయం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ**
**- వివిధ దశల్లో ఉన్న ఇండ్లు వేగంగా నిర్మించాలి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష**





చర్చ :- కరీంనగర్
జిల్లాలో తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం హౌసింగ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 7918 ఇండ్లు మంజూరు చేయగా, 5361 ఇండ్లకు ముగ్గు పోయడం జరిగిందని, 2042 బేస్ మెంట్ లెవెల్, 1011 గోడల లెవెల్, 962 స్లాబ్ లెవెల్ ఉండగా, 8 ఇండ్లు పూర్తి అయ్యాయని, ఇండ్ల లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఇప్పటిదాకా రూ. 49 కోట్ల 85 లక్షల ఆర్థిక సహాయం జమ అయిందని తెలిపారు. నిరుపేదలకు ఇండ్లు ఖచ్చితంగా ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిందని వెల్లడించారు. అన్ని మండలాల్లో నిర్మాణం పూర్తయిన ఇండ్లను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు ప్రతీ మండలంలో వారం రోజుల్లో కనీసం ఒక్కో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన కోనరావుపేట మండల అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, అన్ని ఇండ్లను పూర్తి చేసేలా చూడాలని పిలుపు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇండ్ల నిర్మాణం కోసం మార్కింగ్ తప్పనిసరిగా చేయాలని, పనులు వేగంగా పూర్తి చేసేలా రోజు పర్యవేక్షణ చేస్తూ ఆదేశించారు. లబ్దిదారులు ఇండ్లు నిర్మించుకోవడం, పనులు వేగవంతం చేసేందుకు అధికారులు స్వయంగా వెళ్ళి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. లబ్దిదారులకు పనులు ప్రారంభించేందుకు అవసరమైన వారికి ఐకేపీ, మెప్మా మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వారం తర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తాను, వచ్చే సమీక్ష వరకు ప్రగతి సాధించాలని పేర్కొన్నారు. ప్రతీరోజూ తమ పరిధిలోని గ్రామాలను ఎంపీడీఓ లు సందర్శించి, ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని, ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన సామగ్రి ధరల నియంత్రణ, తదితర అంశాలపై యజమానులతో లేబర్ అధికారి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇసుకకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తహశీల్దార్లతో సమన్వయం చేసుకుని ఇండ్ల నిర్మాణాల ప్రగతిని పెంచాలని, ఇప్పటివరకు ఇండ్ల నిర్మాణాలు ఏయే గ్రామాల్లో ప్రారంభించలేదో దానికి సంబంధించిన వివరాలను గృహనిర్మాణ శాఖ పీడీకి సూచించారు. ప్రతి అధికారి తమ హయాంలో ఇండ్లు నిర్మించి ఇస్తే అది మర్చిపోలేని అనుభూతి అని వివరించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, హౌసింగ్ పీడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సాయం



చర్చ, మణుగూరు:రామానుజవరం పంచాయతీ పరిధిలోని కొండాయిగూడెం గ్రామానికి చెందిన ఎరుపెల్లి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆమెకు బీఆర్ఎస్ పార్టీ రామానుజవరం పంచాయతీ గ్రామ శాఖ అధ్యక్షులు లేళ్ల కృష్ణ సారథ్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బీసీ సెల్ అధ్యక్షులు అక్కి నరసింహారావు, గ్రామ నాయకులు బొగ్గుల నాని, గంధం నతనేలు, మండారు సతీష్, పిట్టల పోతురాజు, రాజబోయిన కృష్ణ, నడికోప్పుల సిద్దు, పిట్టల శ్రీను, కారం మనోహర్, చరప వంశీ, మడకం నాగేంద్రబాబు, సిరిగిడి చిన్న, వలిశెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి కుటుంబ సభ్యులు గురు బాబు, దుర్గమ్మ, సూరిబాబు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విజిలెన్స్ మన అందరి సంయుక్త బాధ్యత: డీఎం సునీత




చర్చ, సత్తుపల్లి:విజిలెన్స్ అనేది మన అందరి సంయుక్త బాధ్యత అని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత అన్నారు. ఆర్టీసీ విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ ఎండి ఆదేశానుసారం గురువారం సత్తుపల్లి బస్టాండ్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విజిలెన్స్ అవగాహనవారము సందర్భంగా ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా డీఎం సునీత మాట్లాడుతూ ఉద్యోగులందరూ కలిసి విజిలెన్స్ అనే ధర్మాన్ని నిలబెట్టాలని సూచించారు. ఈనెల 27వ తేదీ నుండి నవంబర్ 2వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ విజిలెన్స్ మనందరి బాధ్యతగా గుర్తెరిగి నడుచుకోవాలని అన్నారు. ఈ విధంగా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని ఉద్యోగులకు సూచించారు. ప్రతిజ్ఞ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితీ, సత్తుపల్లి డిపో హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్స్, గ్యారేజీ సిబ్బంది, ఏడీసీలు, ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం

**పంట నష్టాన్ని ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తా**
**సత్వరమే సహాయం అందేలా చూస్తాం**
**తడిసిన ప్రతి గింజాను కొనుగోలు చేసేలా కృషి చేస్తాం**
**వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని పకడ్బందీగా సేకరించాలి**
**ఏ ఒక్క రైతుకు నష్టం కలుగకుండా చూడాలి**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటల పరిశీలన**
**కష్టాల్లో ఉన్న రైతులకు వెలిచాల ఓదార్పు**






చర్చ :- కరీంనగర్
తుఫాను ప్రభావంతో వివిధ పంటలు దెబ్బ తినడంతో ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, వల్లంపహాడు, తీగల గుట్టపల్లి గ్రామాల్లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటతో పాటు వివిధ పంటలను గురువారం వెలిచాల రాజేందర్ రావు పరిశీలించారు. తీగల గుట్టపల్లి లో ఐకెపి కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంతో ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఓదార్చారు. ధైర్యం కోల్పోవద్దనీ, మీకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని భరోసా కల్పించారు. ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని పేర్కొన్నారు. పంట నష్టం వివరాలను తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ అధికారులు పక్కాగా నష్టం వివరాలు తనకు అందించాలని సూచించారు. నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తానని వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన రైతుల వివరాలను పకడ్బందీగా పక్కాగా నమోదు చేయాలని సూచించారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నష్టపోయిన రైతులకు సత్వరమే పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా తడిసిన వరి ధాన్యాన్ని ప్రతి గింజాను కొనుగోలు చేసేలా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ప్రత్యేకంగా మాట్లాడుతానని రాజేందర్ రావు పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తుందని రైతులకు నిరంతరం అండగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులందరూ ఏలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదనీ రైతులకు కొండంత అండగా ఉంటామని రాజేందర్రావు భరోసా కల్పించారు. తీగల గుట్టపల్లి ఐకెపి కేంద్రంలో వర్షపు నీరు భారీగా చేరడంతో రాజేందర్ రావు తక్షణమే మున్సిపల్ సిబ్బందితో కాల్వ తీయించి నీటిని బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ధాన్యం తడవకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సత్యం కాంగ్రెస్ నాయకులు కొలగాని అనిల్ కుమార్, అనంతల రమేష్, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది



చర్చ, ములకలపల్లి: ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ఉత్తర్వులు వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. గురువారం జగన్నాథపురం ఏపీసీ కమిటీ ఆధ్వర్యంలో ఎంఇఓ సత్యనారాయణ జగన్నాథపురం సైస్కూల్ హెచ్ఎం వెంకటనర్సమ్మకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జగన్నాథపురం ఎంపిపిఎస్ ఉపాధ్యాయురాలు నాగలక్ష్మిని డిప్యూటేషన్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉండటం చేత కొత్తగా 20 మంది విద్యార్థులను ప్రైవేట్ పాఠశాల నుండి ఈ పాఠశాలలో చేర్పించామని, ప్రస్తుతం 53 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ ద్వారా పంపించటం వలన వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని వాపోయారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తమ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పెద్ద నాన్న అరణ్యంలో కాదు అందరి మధ్యలో ఉండాలి




చర్చ :- గోదావరి ఖని పెద్దపల్లి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి టిప్పిరి తిరుపతికి అలియాస్ దేవ్ జీ ని అభ్యర్థిస్తూ ఆయన సోదరుడు గంగాదర్ కూతురు సుమ తన పెద్ద నానన్నకు సోషల్ మీడియాలో వేదికగా ఇన్ స్టాలో షేర్ చేసిన పోస్ట్ కామెంట్స్ వైరల్ గా మారాయి. ఇన్ని ఇన్ని రోజుల మీ వనవాసం ఎప్పుడు ముగుస్తుందో అని చూసే నాలాంటి వారి తరపున. గెలిచేసిన పోటీలో ఇంకా పాల్గొనడం ఎందుకు. మీరు గెలిచారు. అరణ్యం అంటే మీ పేరే. అడవి అంతా మీ సైన్యమే. మేము నేర్చుకోవాలి.. మేము తెలుసుకోవాలి. మీ నుండి ఇంకా ఎన్నో రావాలి. ఇప్పుడు మీరు అరణ్యంలో కాదు, అందరి మధ్యలో ఉండాలి. పైసా కోసం పరిగెత్తే ప్రపంచం ఇది. సమానత్వం ఉందిలే అని సర్దుకపోయే సమాజం ఇది. వచ్చేయండి మీరు. మా కోసం ఎన్నో నేర్చుకోవాలని ఎదురు చూసే సమాజం కోసం. ఒక మార్పు కోసం. అరణ్యం వదిలి అందరి మధ్యలోకి రావాలి. లొంగుబాటు కాదు ఇది. లోకానికి మీ తెలివి అవసరం. ధైర్యం కోసం, ప్రశ్నించడకోసం ,విప్లవం కోసం ఒక మార్పు కోసం. లొంగుబాటు కాదు .లోకానికి నీ అవసరం. దేవ్ జీ అంటూ ఆయన సోదరుడి కూతురు సుమ రాసిన ఈ వాక్యాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి దండకారణంలో మావోయిస్టు పార్టీ ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపులతో కొంత మంది నేతలు జనజీవన స్రవంతిలోకి వస్తున్న నేపథ్యంలో తన పెద్దనాన్న తిప్పిరి. తిరుపతి అలియాస్ దేవ్ జీ ని ఉద్దేశించి సోషల్ మీడియాలో సుమ చేసిన పోస్ట్ ఇప్పుడు ఆయన ఎలా స్పందిస్తారో తెలియదు కానీ... సోషల్ మీడియా వేదికగా ఆమె ఇచ్చిన పిలపు మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. గతంలో కూడ పెద్దనాన్న ఇంటికి రా అంటూ తిప్పిరి .తిరుపతిని ఉద్దేశించి సుమ షేర్ చేసిన ఫోస్టు వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె చేసిన ఈ పోస్టు కు తన పెద్దనాన్న ఏవిదంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే...

# పోలీసులకు ప్రజల సహకారం అవసరం

**- బెటాలియన్ అదనపుదళాధిపతి అంజయ్య**



చర్చ, సత్తుపల్లి:నేరాల నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో, సంఘ విద్రోహశక్తుల ఆటకట్టించడంలో తమ రక్తాన్ని చిందించి, ప్రాణాలను ప్రాణంగా పెట్టి అసువులు బాసిన అమర పోలీసులకు గంగారం 15వ పోలీసు బెటాలియన్ లో ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం బెటాలియన్ అదనపు దళాధిపతి అంజయ్య అధ్యక్షతన ఓపెన్ హౌస్ కార్యక్రమం జరిగింది. ఈ ఓపెన్ హౌజ్‌లో సహాయ దళాధిపతులు శ్రీధర్ రాజా, రంగారెడ్డి, ఇతర పోలీసు అధికారులు, విశ్వశాంతి విద్యాలయం, డిఏవి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. భారత్%-% చైనా సరిహద్దుల్లో 16 వేల అడుగుల ఎత్తులో మంచు పర్వతాల మధ్య హాట్ స్పిన్ ప్రాంతంలో భారత భూభాగం ఆక్రమణకు వచ్చిన చైనా సైనికులతో పోరాడి 1959 అక్టోబర్ 21న అసువులు బాసిన అమర పోలీసులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ పగలనకా, రాత్రనకా ఎండనక, వాననక , అలసటను లెక్కచేయక పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అభినందించారు. సహాయ దళాధిపతులు శ్రీధర్ రాజా, రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో శాంతి భద్రతలు ప్రతిష్టంగా ఉంటేనే దేశాభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంతటి ఘన కీర్తి కలిగిన పోలీస్ శాఖకు అండగా నిలవాల్సిన బాధ్యత దేశంలో ప్రతి పౌరునిపై ఉందని అభిప్రాయపడ్డారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

# జిల్లాలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యాసంస్థల బంద్ విజయవంతం

**పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి %-% ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు**






చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలంటూ జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు బంద్ నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతోంది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలి. ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి" అని డిమాండ్ చేశారు. ఫీజు అడిగితే విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం సిగ్గుచేటు. ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగినది కాదు. విద్యార్థుల హక్కులను అణగదొక్కడానికి ప్రయత్నించడం దారుణం. విద్యార్థుల సమస్యలపై స్పందించకుండా ప్రైవేట్ కాలేజీలపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన హెచ్చరిస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు, ఉద్యమాలు చేస్తామని తెలిపారు. అభిమన్యు ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు తెచ్చుకొని విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సమస్యలను విస్మరించడం అనర్థాలకు దారితీస్తుంది అన్నారు.

# రైతుల కంట కన్నీరు

**- ఈదురు గాలులతో నేలమట్టమైన వరిపైరు**

**- లబోదిబోమంటున్న రైతన్నలు**





**చర్చ, పినపాక:** మండల వ్యాప్తంగా మెంథా తుఫాన్ రైతన్నల కొంపముంచింది. టీకొత్తగూడెం, జానంపేట, చింతల బయ్యారం, పాతరెడ్డిపాలెం, గోపాలరావుపేట, సింగిరెడ్డిపల్లితోపాటు పలు గ్రామాల్లో గత రెండు రోజులుగా మబ్బులతో కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు చాలాచోట్ల వరి పంట నేలమట్టమైంది. కొన్నిచోట్ల కోత కోసిన పంట, ధాన్యం నిల్వలు తడిసి ముద్దయ్యాయి. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంట నష్టం తప్పదని వారు భావిస్తున్నారు. పినపాక మండలంలో మంగళవారం నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. సాయంత్రానికి వర్షం తీవ్రత పెరిగింది. చాలాచోట్ల ఈదురు గాలులతో కూడిన వాన తెరిపివ్వకపోవడంతో వరి పొలాల్లో నీరు చేరుతోంది. అయితే మరో రెండురోజులపాటు కూడా తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వివిధ మార్గాల్లో పంట సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. కాగా కుప్పలుగా ఉన్న చోట్ల కూడా ధాన్యం మొలకలు వచ్చేస్తాయన్న టెన్షన్ రైతులను వెంటాడుతోంది. అంతంతమాత్రంగానే చేతికందిన పంట ఇంటికి చేరుతుందన్న సమయంలో ప్రస్తుత వాతావరణం రైతన్నలను తీవ్రంగా కలవరపెడుతోంది. ఆశించిన రైతులకు అధిక వర్షాలు నిరాశ మిగిల్చాయి. వరి పంటపై ప్రకృతి ప్రకోపంతో నష్టాల పాలైన అన్నదాతలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# వ్యక్తి ఇంట్లో గంజాయి లభ్యం



**చర్చ, మణుగూరు:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చైతన్యం (డ్రగ్స్ పై యుద్ధం) కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యం రావడంతో ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు మణుగూరు పోలీసులు ఓ వ్యక్తి ఇంట్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో నివాసం ఉంటున్న చల్ల శ్రీనివాస్ ఇంట్లో గంజాయి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఉన్నత అధికారులకు తెలియజేసి డీఎస్పీ రవీంధర్ ఉత్తర్వుల మేరకు పోలీసులు చల్లా శ్రీనివాస్ ఇంటిని సోదా చేశారు. ఇంట్లో 3.5 కేజీల గంజాయి దొరకటంతో పోలీసులు విచారణ చేపట్టారు. శ్రీనివాస్ అన్న కొడుకు చల్ల సతీష్, తన స్నేహితుడు రేపాకుల సాగర్ కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో సీలేరు నుండి గంజాయి తీసుకువచ్చి అమ్ముతుంటారని శ్రీనివాస్ తెలిపాడని పోలీసులు చెప్పారు. అతను కూడా సొమ్ము చేసుకోవచ్చుననే ఉద్దేశంతో గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్‌తోపాటు చల్లా సతీష్, రేపాకుల సాగర్‌లపై కేసు నమోదు చేసి, శ్రీనివాస్‌ను రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. చల్లా సతీష్, సాగర్‌లను ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరించారు. ఈ దాడిలో మణుగూరు సి.ఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొనారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**చర్చ, సత్తుపల్లి:** మండల కేంద్రంలోగల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం జిల్లా వేంసూరు మండలానికి చెందిన అర్హులైన 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మట్ట రాగమయి చేతుల మీదుగా అందించారు. ఎస్టీలకు 8, ఎస్సీలకు 14, బీసీలకు 3 చొప్పున మొత్తం 23 మందికి గాను రూ. 25,02,900 విలువ చేసే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్ట రాగమయి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఇతర మంత్రుల ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల రెవెన్యూ అధికారి, వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి

**- సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జీఎం, ప్రధానోపాధ్యాయురాలికి వినతిపత్రం**



**చర్చ, మణుగూరు:** నిరుపేదలకు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో సింగరేణి పాఠశాల విద్యాభ్యాసం ఉందని, అలాగే విద్యార్థుల రద్దీకి అనుగుణంగా మణుగూరు సింగరేణి పాఠశాలలో బస్సుల సంఖ్య పెంచాలనీ కోరుతూ గురువారం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జిఎం సిరికొండ వెంకటాచారి, పివి కాలనీ సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణికి మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నే బాబురావు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు ఏరియా సింగరేణి హైస్కూల్ నందు సుమారు 650 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారని, దూర ప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థిని విద్యార్థుల ప్రయాణ సౌకర్యార్థం నడుస్తున్నటువంటి ప్రైవేట్ స్కూల్ బస్సులు రద్దీకి అనుగుణంగా లేవన్నారు. బస్సులలో 50 సీట్లు ఉండగా 90 నుంచి 100 మంది విద్యార్థిని విద్యార్థులను ఎక్కిస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయని, విద్యార్థులకు అసౌకర్యంగా ఉండటంతోపాటు డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించడం ద్వారా ప్రమాదం పొంచి ఉందన్నారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులు ఎక్కించకుండా కార్పొరేట్ నుండి అనుమతి తీసుకొని అదనపు ట్రిప్పులు వేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బస్సుల సంఖ్య పెంచాలని అన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ముందుండే ప్రకృతి ప్రేమికుడు బాలు మాస్టారు














**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్వారం ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు, ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్ పర్యావరణ పరిరక్షణలో ప్రత్యేక గుర్తింపు సాధించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు మాత్రమే కాదు, ప్రజలకు కూడా ప్రకృతి పాఠాలు నేర్పిస్తూ, పర్యావరణ రక్షణను తన జీవిత ధ్యేయంగా మార్చుకున్నారు. పచ్చదనం పెంపొందించడం, కాలుష్యాన్ని తగ్గించడం, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వందలాది మొక్కలు నాటుతూ వాటిని స్వయంగా సంరక్షించడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. యువతలో పర్యావరణంపై చైతన్యం కలిగించేందుకు బాలు సార్ నిర్వహించే అవగాహన కార్యక్రమాలు మంచి స్పందన పొందుతున్నాయి. "ప్రకృతిని కాపాడటం ప్రతి మనిషి బాధ్యత. ఒక చెట్టు నాటితే అది మనకు పది తరాలకు జీవనాధారం అవుతుంది" అని ఆయన అన్నారు. ఆయన కృషికి గుర్తింపుగా 2025లో యంగ్ ఇండియన్ సేవా పురస్కార్, గౌతమ బుద్ధ చక్రవర్తి అవార్డు, సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారం అందుకున్నారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు బాలు సార్ కృషిని ప్రశంసిస్తూ, ఆయన చూపిన దారిలో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుతున్నారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**- నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే**


**- జిల్లా కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు**





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్రవ్యాప్తంగా తుఫాను ప్రభావం ఉన్న జిల్లాల్లో ప్రభుత్వం పూర్తిస్థాయి అప్రమత్తతతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాలు సమన్వయంతో అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితులను సమీక్షించారు. భద్రతా, సహాయక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. "వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నాను. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తాను," అని ముఖ్యమంత్రి తెలిపారు. తుఫాను ప్రభావిత జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు అండగా నిలవాలని, ప్రతి స్థాయిలో అధికారులు ప్రజలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. "ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎవరి ప్రాణ నష్టం జరగకూడదు, పశు నష్టం, పంట నష్టం జరగకుండా ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలి," అని సీఎం అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలని, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రమాదకర ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేయాలని, వాగులు, వంకల వద్ద ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అవసరమైనచోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని, అత్యవసర వైద్య సేవలను తక్షణం అందుబాటులో ఉంచాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించి, డ్రోన్ల ద్వారా తాగునీరు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. వరంగల్‌లో వరద బాధితులకు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను తక్షణం తరలించి, హైడ్రా సిబ్బంది మరియు సహాయక సామాగ్రిని వినియోగించి ప్రజలకు తక్షణ సాయం అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారిని రుక్మిణి , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్‌ల కోసం ప్రైవేట్ కళాశాల విద్యార్థుల ధర్నా













**చర్చ, సత్తుపల్లి:** కల్లూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌లు త్వరగా విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ప్రైవేట్ కళాశాలల బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు అరగంటసేపు విద్యార్థినీ విద్యార్థులు వలయంలా ఏర్పడి నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఐదు సంవత్సరాల నుండి గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం విద్యార్థులకు లక్షల కోట్ల స్కాలర్షిప్ నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడంతో ప్రైవేట్ కళాశాలల, విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడ్డాయని ఆరోపించారు. త్వరితగతిన ప్రభుత్వం స్కాలర్ షిప్ నిధులను విడుదల చేసి ప్రైవేటు కళాశాలలను, విద్యార్థులను ఆదుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకొని భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు.

## ఫోరెన్సిక్ సాక్ష్యంపై అవగాహన సదస్సు

**- ఐఎల్‌పీఏ జిల్లా కన్వీనర్ గోపీకృష్ణ, సుంకర భానుప్రియ**



**చర్చ, కొత్తగూడెం లీగల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాదుల కోసం నవంబర్ 1న ఫోరెన్సిక్ సాక్ష్యంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక అడ్వకేట్స్ లైబ్రరీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఐఎల్‌పీఏ జిల్లా కన్వీనర్ గోపికృష్ణ, మహిళా కన్వీనర్ సుంకర భానుప్రియ తెలిపారు. గురువారం న్యాయవాదుల లైబ్రరీ హాల్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో "నేటి న్యాయవ్యవస్థలో ఫోరెన్సిక్ %–% శాస్త్రీయ సాక్ష్యాలు" అనే అంశంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు ఈ రంగంలో అవగాహన పెంపొందించుకోవడం ద్వారా న్యాయ సాధనలో మరింత సమర్థవంతంగా వ్యవహరించగలరని అన్నారు. సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సదసుసలో ఫౌండర్, ప్రోబ్ ల్యాబ్ ఫోరెన్సిక్ డైరెక్టర్ డాక్టర్ ఎర్రగోళ్ల మోహన్ ప్రధాన వనరుల నిపుణుడిగా పాల్గొని ఆయా అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తారని, పాలీగ్రాఫిక్ %–% ఫింగర్‌ప్రింట్ టెస్టులు, నార్కో విశ్లేషణ, లై డిటెక్షన్, సంతకం పరీక్ష, డిజిటల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ ల్యాబ్ విధానాలు, శాస్త్రీయ విశ్లేషణ పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయమూర్తి పి.వసంత్, విశిష్ఠ అతిథిగా అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సరిత హాజరుకానున్నారని, వీరితో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడపాల మహాలక్ష్మి, యెర్రా కామేష్, సాధిక్ పాషా, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, దొడ్డా సామంత్, మేకల దేవేందర్, అడపాల పార్వతీ, పాల రాజశేఖర్, పగిడిపల్లి శ్రీకాంత్, వడ్లకొండ హరిప్రసాద్, లక్ష్మి సరిత, ఇందిరా ప్రియదర్శిని, బేబీ షామిలి, దారావత్ రాధాకృష్ణ, ఎర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలలపాటు ఫర్నిచర్ అసిస్టెంట్ శిక్షణ : కలెక్టర్




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** మూడు నెలల ఫర్నిచర్ అసిస్టెంట్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ఉపాధి పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువతకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 6న కలెక్టరేట్‌లో డ్రాయింగ్‌పై టెస్ట్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువత ఫర్నిచర్ ప్రొడక్షన్, ఇన్‌స్టలేషన్, మెషిన్ ఆపరేషన్ రంగాల్లో నైపుణ్యం సాధించి స్థిరమైన ఉద్యోగ అవకాశాలు పొందగలరని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడతలో 8 మంది గిరిజన యువత శిక్షణ పూర్తి చేశారని, వారు రూ. 15 వేల వేతనంతో అప్రెంటిస్‌గా ఉన్నారని తెలిపారు. విడతకు 20 మంది అభ్యర్థులు ఎంపిక చేయబడనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 5వ తేదీలోగా గూగుల్ ఫారం ద్వారా, క్యూ ఆర్ కోడ్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నవంబర్ 15 నుంచి హైదరాబాద్‌లో శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 %–% 35 సంవత్సరాల వయస్సు కలిగి, డ్రాయింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అభ్యర్థులకు ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు.

## విశ్రాంతి ఉద్యోగులకు పెన్షన్‌తోపాటు మెడికల్ కార్డ్ రెన్యువల్ చెయాలి



**చర్చ, కొత్తగూడెం:** ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో సమర్పించే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల మెడికల్ కార్డ్ రెన్యువల్ చెయ్యాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీఎం పర్సనల్‌కు గురువారం వినతిపత్రం అందచేసిన అనంతరం వారు మాట్లాడుతూ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పెన్షన్ రెన్యువల్ కొరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0ను సింగరేణి యాజమాన్యంతో కలసి చేపట్టిన కార్యక్రమాన్ని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వాగతిస్తుందని తెలిపారు. కాని సింగరేణి విశ్రాంతి ఉద్యోగులు ప్రతి సంవత్సరం పెన్షన్ కొరకు లైఫ్ సర్టిఫికెట్‌తోపాటు సింగరేణి యాజమాన్యం జారీ చేసిన సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డు రెన్యువల్ కొరకు రిటైర్డ్ ఉద్యోగితోపాటు భాగస్వామి కూడా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే అవసరముందని, పెన్షన్ కొరకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ వారికి, సిపిఆర్ఎంఎస్ కార్డు రెన్యువల్ కొరకు సింగరేణికి సమర్పించాలని, సిఎంపీఎఫ్ వారు నిర్వహించే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0 కార్యక్రమంలో సిపిఆర్ఎంఎస్ కార్డు రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంతంగి లింగయ్య, లక్ష్మీనారాయణ, వంగ వెంకట్, క్రిస్టోఫర్, హుమాయూన్, రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, మధుకృష్ణ, అబ్బాస్, అలీ, షబ్బీర్, అల్లి మోహన్ పాల్గొన్నారు.

## ఏఐటియుసి కృషితోనే సూటబుల్ జాబ్స్

**- ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**



**చర్చ, కొత్తగూడెం సింగరేణి:** సింగరేణిలో అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్‌లకు ఏఐటియుసి కృషి వల్ల సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటియుసి హయాంలో అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చే వారని, కాని 2018 మార్చి నుంచి దానిని నిలిపి వేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్, క్యాటగిరి వన్‌లో పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. దీనివల్ల సింగరేణిలో చాలామంది మైనింగ్ స్టాప్, ట్రేడ్స్‌మెన్స్ మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారని, దీనికి అప్పటి గుర్తింపు సంఘం టిబిజికెఎస్, యాజమాన్యం అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలు కారణమన్నారు. 2023 గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటియుసి ఇచ్చిన హామీ మేరకు యాజమాన్యంపై ఒత్తిడి చేసినట్లు చెప్పారు. యాజమాన్యం దీనిపై అంగీకరించి ఒక కమిటీ వేసి పరిష్కారం చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మిగతా సమస్యల పరిష్కారం కోసం కూడా ఏఐటీయూసీ కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# అర్బన్ బ్యాంకును సమూలంగాప్రక్షాళన చేస్తాం

**- మంచి మెజార్టీతో మా ప్యానల్ దే ఘనవిజయం**
**గత పాలకవర్గంలో ఉన్న వారు అద్వాన స్థితికి తెచ్చారు**
**రాజకీయ జోక్యం లేకుండా చూస్తాం**
**ఇతర బ్యాంకులకు దీటుగా సేవలందిస్తాం**
**మా ప్యానల్ కు ఒక అవకాశం ఇవ్వండి**
**మంత్రులు, విప్ ఆశీస్సులతో మీ ముందుకు వచ్చాం**
**వివాదాల నుంచి వినూత్నంగా తీర్చిదిద్దుతాం**
**ఈరోజు 20 సంఘాలు మద్దతు ప్రకటించాయి**
**1000 ఏనుగుల బలం వచ్చింది**
**మంచి మెజార్టీతో మా ప్యానల్ గెలుస్తుంది**
**అన్ని వర్గాల మద్దతుతో అఖండ విజయం**





**కరీంనగర్** అర్బన్ బ్యాంక్ మెంబర్లు మార్పు కోసం నిర్మల భరోసా ప్యానల్ కు మద్దతు ఇవ్వండి. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులతో వెలిచాల ప్రెస్ మీట్‌మేనిఫెస్టో ప్రకటన. గత పాలకవర్గాల హాయంలో అర్బన్ బ్యాంకు అద్వాన స్థితికి చేరుకుందనీ, అస్తవ్యస్తంగా మార్చారనీ, బ్యాంకును సమూలంగా ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. నీతి నిజాయితీతో మీ ముందుకు వచ్చిన మా ప్యానల్ అభ్యర్థులకు అర్బన్ బ్యాంకు మెంబర్లు మార్పు కోసం ఆశీర్వదించాలని మంచి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం సాయం త్రం కరీంనగర్లోని మైత్రి హోటల్లో వెలిచాల రాజేందర్రావు అర్బన్ బ్యాంక్ ప్యానల్ అభ్యర్థులతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహిం చారు. ఈ ప్రెస్ మీట్ లో తమ ప్యానెల్ ను గెలిపిస్తే అర్బన్ బ్యాంకు ను ఏ విధంగా తయారు చేస్తామనే అంశంపై ఒక మేనిఫెస్టో మేనిఫెస్టోను ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ గత పది సంవత్స రాల కాలం నుంచి అర్బన్ బ్యాంకు అద్వానస్థితికి చేరుకుందని, దీనికి గత పాలకవర్గాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. బ్యాంకు పాలకవర్గాలు బ్యాంకు అభివృద్ధి కోసం దోహదపడాలి కానీ వారి సొంత లాభం కోసం చూసుకున్నారు బ్యాంకును ఏ మాత్రం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 8 సంవత ్సరాలుగా ఎన్నికలు జరగకుండా కోర్టులో కేసులు వేసి అడ్డుక ున్నారని మళ్ళీ వారే వచ్చి మాకు అధికారం కావాలని ఓట్లు అడుగుతున్నారని పేర్కొన్నారు. అనేక అవినీతి ఆరోపణలు ప్రతా ్యరోపణలు ఇల్లీగల్ మెంబర్షిప్ ఇతర వివాదాస్పద అంశాలు మీడియాలో పత్రికల్లో పెద్ద ఎత్తున వచ్చాయని తెలిపారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధి ఏమోగానీ ప్రతిష్టను దెబ్బ తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. గోల్డ్ పేట రోల్డ్ గోల్డ్ పెట్టి రుణాలు కూడా తీసుకున్నారని ఆరోపణలు అప్పట్లో వచ్చాయని పేర్కొన్నారు. ఇతర బ్యాంకులు డిపాజిట్లను పెట్టుబడుల కోసం వివిధ రకాల ప్రయత్నాలు చేస్తుంటే అర్బన్ బ్యాంక్ పాలకవర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించాయని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు కోసం కాంగ్రెస్ భావాజాలం కాంగ్రెస్ వ్యక్తిత్వం సామాజిక సేవ నేపథ్యం నీతిమంతంగా నిజాయితీ వంతంగా జ్ఞానం పరిజ్ఞానం వారితో కలిసి ఒక ప్యానెల్ ను ఏర్పాటు చేశానని తెలిపారు. అర్బన్ బ్యాంకు ను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు తమ ప్యానెల్ కు ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని ఒక అవకాశం ఇచ్చి చూడాలని కోరారు. మంచి సేవా భావం ఎలాంటి లాభ పక్ష లేకుండా పనిచేసేందుకు ముందుకొచ్చిన నిర్మల భరోసా ప్యానల్ ను గెలిపించవలసిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు. గురువారం కరీంనగర్ లో ఉన్న 20 సంఘాలు తమ ప్యానెల్ కు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతు తెలుపడం అభినందనీయమన్నారు. లారీ అసోసియేషన్, ఆటోనగర్ అసోసియేషన్, హమాలీ సంఘం పద్మశాలి సంఘం, కాపు సంఘం, రెడ్డి సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, గౌడ సంఘం, ఐఎంఏ డాక్టర్ల సంఘం బార్ అసోసియేషన్ తో పాటు దాదాపు 20 సంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ ప్యానెల్ కు మద్దతు ప్రకటించాయని తెలిపారు. అభ్యర్థులందరినీ మంచి మెజార్టీతో గెలిపిస్తామని వారు పేర్కొనడం అభినందనీయమని రాజేందర్రావు పేర్కొన్నారు. కరీంనగర్ జగిత్యాల ప్రాంతాల్లో రిటైర్డ్ ఉద్యోగులు సంఘాల ప్రతినిధులు వాకర్స్ అనేకమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతు సంఘీభావం ప్రకటించారని తెలిపారు. అర్బన్ బ్యాంక్ అభివృద్ధిలో మా తండ్రి జగపతిరావు పాత్ర గణనీయంగా ఉందన్నారు. నాలుగు ఎన్నికల్లో ప్యానెల్ ఏర్పాటు చేసి గెలిపించిన ఘనత మా తండ్రిగారిదేనని తెలిపారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారని ఆయన ఆశయ సాధనకు తాను అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో 18 వేల మెంబర్లతో నడిచిన అర్బన్ బ్యాంకు నేడు 9000 పరిమితమైందని బ్యాంకును మొత్తం లోపభూయిష్టంగా మార్చి వేశారని పారదర్శకతకు పాతర వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా డిపాజిట్లు పెంచడం.. ఖాతాదారులను చేర్పించడం మర్చిపోయారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన కర్ర రాజశేఖర్, గడ్డం విలాస్ రెడ్డిలు ఇరువురు ఆరోపణలు చేసుకొని బ్యాంకు ప్రతిష్టను దెబ్బతీశారని ఆరోపించారు. ఈ లాంటి తరుణంలో బ్యాంకును మొత్తం ప్రక్షాళన డిజిటలైజేషన్ చేసేందుకు తమ ప్యానల్ కు అవకాశం కల్పించాలని కోరారు. మంత్రుల ఆశీర్వాదంతో ముందుకు. ప్యానల్ అభ్యర్థులతో కలిసి మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు ,విప్ ఆది శ్రీనివాస్ వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నామని రాజేందర్రావు పేర్కొన్నారు. తప్పకుండా గెలిచి రావాలని కోరారు. ఈ తమకెంతో ఉత్సాహాన్ని అందించిందని అదేవిధంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మద్దతు ఇచ్చారని తెలిపారు. అక్కడి నుంచి ఇద్దరు మంచి వ్యక్తులను ప్రతిపాదించడం హర్షనీయ మన్నారు. జగిత్యాల లో మంచి మెజార్టీ రావడానికి ఎమ్మెల్యే తీవ్రంగా కష్టపడుతున్నారని రాజేందర్ పేర్కొన్నారు. జాతీయ బ్యాంకులతో పాటు ఇతర బ్యాంకులకు ధీటుగా ఎయిర్ కండిషన్ తో కూడిన సత్వరమే సేవలందిస్తామ న్నారు... ఖాతాదారులకు పెట్టుబడిదారులకు రక్షణగా ఉంటాము. విశ్వాసాన్ని కల్పిస్తాము. వారి నమ్మకాన్ని వమ్ము చేయబోము. బ్యాంకును సంస్కరిస్తామని ఆన్లైన్లో లావాదేవీలు ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్స్ చేపడుతాము. ఖాతాదారులకు సత్వరమే సేవలందించేలా చూస్తాము అనీ చెప్పారు. కరీంనగర్ జగిత్యాలలో అదనంగా ఒక్కొక్క బ్రాంచ్ ను ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా హుస్నాబాద్, హుజురాబాద్ జమ్మికుంట, చొప్పదండి లో కొత్త బ్రాంచులను ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా 72 కోట్లు ఉన్న డిపాజిట్లను వచ్చే మూడేళ్లలో 200 కోట్లు డిపాజిట్ చేరుకునేలా బ్యాంకు ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం.. అని పేర్కొన్నారు. అదేవిధంగా 58 కోట్ల అడ్వాన్సులను 150 కోట్లకు చేరుకునేలాగా కృషి చేస్తామని హామీ ఇస్తున్నాను. మూడు సంవత్సరాలలో ఈ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని గంట పదంగా చెబుతున్నాను. మాట ఇవ్వడమే కాదు అర్బన్ బ్యాంకును తెలంగాణ రాష్ట్రంలోనే స్మార్ట్ బ్యాంకు గా తయారు చేస్తామని రాజేందర్ రావు హామీ ఇచ్చారు.

స్వచ్ఛందంగా వివిధ సంఘాల మద్దతు. నిర్మల భరోసా ప్యానల్ కు స్వచ్ఛందంగా వివిధ సంఘాలు గురువారం మద్దతు తెలిపాయని రాజేందర్రావు పేర్కొన్నారు. వారు ముందుకొచ్చి మద్దతు తెలుపడం అభినందనీయమన్నారు. వివిధ కుల సంఘాలు రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్, రెడ్డి సంఘం, వెలమ సంఘం, పద్మశాలి సంఘం, కురుమ సంఘం, గౌడ సంఘం, బార్ ఆసోసియేషన్, రెడ్క్రాస్ ప్రతినిధులు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఆటో యూనియన్ పెయింటర్స్ అసోసియేషన్ హమాలి సంఘంతో పాటు పలు సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారని అదేవిధంగాముదిరాజ్ సంఘం, బీసీ సంఘాలు లారీ అసోసియేషన్, హమాలి సంఘం, ఆటో యూనియన్ ప్రతినిధులు రిటైర్డ్ ఉద్యోగులు, ప్రతి ఒక్క అర్బన్ బ్యాంకు మెంబర్ పెద్ద ఎత్తున ముందుకు వచ్చి తమ అభ్యర్థులకు మద్దతు ప్రకటించారని తెలిపారు. మా ప్యానల్ కు మద్దతిస్తున్న వీరందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు.. తెలుపుతున్నాను అని పేర్కొన్నారు.

మేనిఫెస్టో ఐదు గ్యారంటీలు. వివిధ సంఘాల ప్రతినిధులు బీసీలు ఎస్సీలు ఎస్టీలు ఓసి లు అన్ని వర్గాల ప్రజలు ముస్లిం మైనార్టీల సహకారంతో గెలుపు బాటలో పయనిస్తున్నామన్నారు. 100కు 100% మంచి మెజార్టీతో గెలవబోతున్నామని రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంకులో రాజకీయ జోక్యం లేకుండా పాలన సాగిస్తామనీ, రాజకీయాలకు ప్రవేశం లేకుండా చేస్తామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుదాం. బ్యాంకులో రాజకీయాలకు తావులేదు. ఆ విధంగా కఠినంగా వ్యవహరిస్తాం అని స్పష్టం చేశారు. బ్యాంకులో డిజిటల్ సేవలందిస్తాం బ్యాంకులో అన్ని విభాగాలను ఆధునీకరించి సిబ్బంది మర్యాదపూర్వకంగా ఖాతాదారులతో వ్యవహరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. రుణాలు ఇతర పనులు వినియోగదారులకు తక్షణమే అందేలా ఒక ప్రణాళికను రూపొందిస్తాం. వినియోగదారుల విశ్వాసమే రక్షణ లక్ష్యంగా పనిచేస్తాం అని చెప్పారు. అర్బన్ బ్యాంకు సేవలను మరింత విస్తరిస్తాం. అకౌంట్ హోల్డర్లు మెంబర్ల సంఖ్యను పెద్ద సంఖ్యలో పెంచుతాం. అని పేర్కొన్నారు. ఖాతాలు ఇప్పిస్తాం.. పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తాం.. వినూత్న పద్ధతుల్లో కస్టమర్లను ఆకట్టుకుంటూ పెద్ద సంఖ్యలో వారికి అకౌంట్స్ అందిస్తామని చెప్పారు. కరీంనగర్ జగిత్యాల లో రెండో బ్రాంచ్, జమ్మికుంట, హుస్నాబాద్, హుజురాబాద్, చొప్పదండిలో కొత్తగా బ్రాంచ్ లను ఓపెన్ చేస్తామని. అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు కేసుల్లో బ్యాంకు చిక్కుకోకుండా.. పారదర్శకంగా పాలకవర్గంతో తను వెన్నంటే ఉండి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. చిన్న అవినీతి మరకంటకుండా నిర్మల భరోసా ప్యానల్ విధులు నిర్వర్తిస్తుంది. ఏ ఒక్క ఆరోపణ రాకుండా అవినీతి రహితంగా వారితో పని చేయిస్తాం.. ఈ మేనిఫెస్టోలను ఈ గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతామని రాజేందర్ రావు హామీ ఇచ్చారు.

మార్పు కోసం వివాదాల నుంచి విశ్వాసం వైపు నడిపించేందుకు మా ప్యానల్ మెంబెర్స్ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజేందర్ రావు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిపల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకుల నరసన్న, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, అనంతుల రమేష్, బట్టు వరప్రసాద్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ఫోరెన్సిక్ సాక్ష్యంపై అవగాహన సదస్సు

**- ఐఎల్‌పీఏ జిల్లా కన్వీనర్ గోపీకృష్ణ, సుంకర భానుప్రియ**

**చర్చ, కొత్తగూడెం లీగల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాదుల కోసం నవంబర్ 1న ఫోరెన్సిక్ సాక్ష్యంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక అడ్వకేట్స్ లైబ్రరీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఐఎల్‌పీఏ జిల్లా కన్వీనర్ గోపికృష్ణ, మహిళా కన్వీనర్ సుంకర భానుప్రియ తెలిపారు. గురువారం న్యాయవాదుల లైబ్రరీ హాల్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో "నేటి న్యాయవ్యవస్థలో ఫోరెన్సిక్ %–% శాస్త్రీయ సాక్ష్యాలు" అనే అంశంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు ఈ రంగంలో అవగాహన పెంపొందించుకోవడం ద్వారా న్యాయ సాధనలో మరింత సమర్థవంతంగా వ్యవహరించగలరని అన్నారు. సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాదులందరూ పాల్గొని




విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సదసుసలో ఫౌండర్, ప్రోబ్ ల్యాబ్ ఫోరెన్సిక్ డైరెక్టర్ డాక్టర్ ఎర్రగోళ్ల మోహన్ ప్రధాన వనరుల నిపుణుడిగా పాల్గొని ఆయా అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తారని, పాలీగ్రాఫిక్ %–% ఫింగర్‌ప్రింట్ టెస్టులు, నార్కో విశ్లేషణ, లై డిటెక్షన్, సంతకం పరీక్ష, డిజిటల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ ల్యాబ్ విధానాలు, శాస్త్రీయ విశ్లేషణ పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయమూర్తి పి.వసంత్, విశిష్ఠ అతిథిగా అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సరిత హాజరుకానున్నారని, వీరితో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడపాల మహాలక్ష్మి, యెర్రా కామేష్, సాధిక్ పాషా, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, దొడ్డా సామంత్, మేకల దేవేందర్, అడపాల పార్వతీ, పాల రాజశేఖర్, పగిడిపల్లి శ్రీకాంత్, వడ్లకొండ హరిప్రసాద్, లక్ష్మి సరిత, ఇందిరా ప్రియదర్శిని, బేబీ షామిలి, దారావత్ రాధాకృష్ణ, ఎర్ర శ్రీను పాల్గొన్నారు.


# తప్పిన ప్రమాదం

**- సిలిండర్లతో బోల్తాపడిన లారీ**



**చర్చ, మణుగూరు:** గ్యాస్ సిలిండర్ లోడుతో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడిన సంఘటన గురువారం అశోక్‌నగర్ సాయిబాబా గుడి వద్ద చోటు చేసుకుంది. రోడ్డుపై గుంటలు వర్షం నీటితో నిండిపోవడంతో రోడ్డు సరిగ్గా కనిపించక లారీ గుంటలో పడి అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న డివైడర్ పైకి ఎక్కటంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పలు సిలెండర్లు రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. ఒక్క సిలిండర్ కూడా బ్లాస్ట్ కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో చుట్టుపక్కన ప్రజలు, వ్యాపారస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేయాలని మణుగూరు ప్రజలు కోరుకుంటున్నారు.

## ఏపీ కేబినెట్ సమావేశం వాయిదా



**అమరావతి:** నవంబర్ 7న జరగాల్సిన ఏపీ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. కేబినెట్ భేటీని నవంబర్ 10వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబర్ 10వ తేదీకి కేబినెట్ సమావేశం వాయిదా వేస్తూ సీఎస్ కార్యాలయం నోట్ విడుదల చేసింది. మంత్రివర్గ సమావేశం నిర్వహణకు సంబంధించిన మార్పులను గమనించాల్సిందిగా అన్ని శాఖల కార్యదర్శులకు సూచనలు చేసింది.అయితే.. విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల సదస్సుపై మంత్రి వర్గం చర్చించనుంది. మంత్రులు అందరికీ సదస్సు నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై మంత్రి వర్గ ఉప సంఘం నియామకమైన విషయం తెలిసిందే. దీంతో పాటు రాజధాని అమరావతి పనులు, భూముల కేటాయింపులపై కూడా మంత్రి వర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే.. శాంతి భద్రతల అంశంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రాష్ట్రంలో కొనసాగుతున్న మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా.. కేబినెట్ భేటీని వాయిదా వేసినట్లు సమాచారం.పులిచింతలకు పోటెత్తిన

## వరద ఆ గ్రామాలకు హెచ్చరికలు



**అమరావతి, అక్టోబర్ 30:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రాజెక్టుకు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో.. అధికారులు 4 లక్షల 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ప్రకాశం బ్యారేజ్‌కు 2 లక్షల 74 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరింది. దీంతో అధికారులు బ్యారేజ్ అన్ని గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌కు మున్నేరు, కీసర, వైర, కట్టలేరు నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది (గురువారం) సాయంత్రానికి ప్రకాశం బ్యారేజ్‌కు పులిచింతల నుంచి సుమారు 4 లక్షల 80 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజ్‌కు సాయంత్రానికి సుమారు 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరద చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో బ్యారేజ్ దిగువ భాగాన ఉన్న కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలలోని నదీతీర మండలాలు, గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. లంక గ్రామాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు కోరారు.అక్కడి ప్రజలు జాగ్రత్త: విపత్తుల నిర్వహణ సంస్థభారీ వర్షాలకు కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతోందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ వద్ద దిగవకు వరద నీటి విడుదల చేసినట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతానికి ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉందన్నారు. బ్యారేజ్ వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని.. వరద ఫ్లో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. క్రమక్రమంగా వరద తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో లంక గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని.. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నదిలో ప్రయాణం, ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## వీఎంసీ పాలకవర్గంపై ప్రభుత్వం సీరియస్



**అమరావతి, అక్టోబర్ 30:** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. విజయవాడలో స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కార్పొరేషన్ చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన పాలక వర్గంపై సీరియస్ అయ్యింది. విజయవాడ నగర పాలక సంస్థ పాలకవర్గం తీరును రాష్ట్ర ప్రభుత్వం తప్పుబట్టింది. డ్వాక్రాలోని మహిళా చిరు వ్యాపారులకు దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను పాలకవర్గం పాటించలేదు. స్కీమ్ అమలు చేయలేమని, రూ.1.16 కోట్లు కేటాయించలేమని అక్టోబర్ 8న తీర్మానం చేసింది. వైసీపీ ఛైర్‌పర్సన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి నేతృత్వంలోని పాలకవర్గం ఈ మేరకు తీర్మానం చేసింది.కార్పొరేషన్‌లో వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ తీర్మానం చేస్తున్న పరిస్థితి. అయితే ఈ ఏడాది అక్టోబర్ 8న పంపిన తీర్మానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. విజయవాడలోని ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని సర్కార్ ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై 30న విడుదల చేసిన జీవో 753 అమలు చేయాలని నిర్దేశించింది. నగర పాలక సంస్థ వాటా నిధులతో మార్కెట్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఆదేశాలిచ్చారు.

## కర్నూలు ఘటన కాలిపోయిన బస్సు దగ్గర బంగారం కోసం వెతుకులాట



**కర్నూలు :** చిన్న టేకూరులో ఈ నెల 24వ తేదీన ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. బస్సు అగ్నికి ఆహుతి కావటంతో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ రోడ్డు ప్రమాదం దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల దగ్గరి నుంచి ప్రధాని వరకు అందరూ ఈ సంఘటనపై స్పందించారు.
తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, ఈ ప్రమాదంలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలు ఇంకా ఆ బాధ నుంచి తేరుకోలేదు. ఇలాంటి సమయంలో కొంతమంది అత్యంత అమానుష పనికి తెరతీశారు.బస్సు దగ్గర బంగారం కోసం వెతుకులాట.అగ్గిలో కాలి బూడిద అయిన బస్సును అధికారులు రోడ్డు మీద నుంచి పక్కకు తీసుకువచ్చి పెట్టారు. ఆ బస్సు దగ్గర కొంతమంది బంగారం కోసం వెతుకులాట ప్రారంభించారు. దాదాపు ఎనిమిది మంది దాకా ఆ బస్ దగ్గర బూడిదను సేకరించారు. బస్తాలలో నింపుకున్నారు. వారు ఎంతో ఓపిగ్గా బూడిదను తవ్వి మరీ బస్తాలలో నింపుకున్నారు.బంగారం వెలికితీయడం కోసమే బూడిదను సేకరించినట్లు తెలుస్తోంది. ఇక, ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు బస్సు దగ్గర బంగారం కోసం వెతుకుతున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఛీ మీరసలు మనుషులేనా' అంటూ మండిపడుతున్నారు.

# మట్టి మాఫియా ఆగడాలు

### నిద్రావస్థలో ప్రభుత్వ శాఖలు

- విచ్చలవిడిగా అక్రమ మట్టి తవ్వకాలు
- అన్ని తెలిసిన అధికారుల నిర్లక్ష్యం
- అనుమతులు లేకుండానే దళారులు తవ్వకాలు
- ఒక్క ట్రాక్టర్ ట్రక్కు మట్టి ధర రూ.500 నుండి రూ. వెయ్యి వరకు అమ్మకాలు
- నాయకుల అండతో రాత్రింబవళ్లు మట్టి తోలకం





**చర్చ, అశ్వారావుపేట:** అక్రమ వ్యాపారానికి అడ్డేది లేదు అన్నట్టు ఉంది అశ్వారావుపేట మట్టి మాఫియా పరిస్థితి పేట పరిధిలో మట్టి మాఫియా రాజ్యం నడుస్తోంది. పేరాయిగూడెం గ్రామం పరిసర ప్రాంతాల నుంచి పట్టణంలోకి నిరంతరం మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రింబగళ్లు కొనసాగుతున్న ఈ మట్టి తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం అధికారులు చేయకపోవడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అక్రమ మట్టి తవ్వకాలపై స్థానికులు, రైతులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది. గ్రామస్థులు పలుమార్లు తహసిల్దార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించినా ఎక్కడ తోలుతున్నారు అంటూ వ్యగ్యంగా ఎదురుప్రశ్న వేయడంతో అసహనం వ్యక్తమవుతోంది. చివరికి ఫోన్ లిఫ్ట్ చేసినా కూడా తహసిల్దార్ మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని చెబుతున్నా, అక్రమ తవ్వకాలు మాత్రం కొనసాగుతుండటం దీనికి కొసమెరుపు. స్థానికులు చెబుతున్నట్లుగా, ఈ అక్రమ తవ్వకాలు ఒక బడా నాయకుడి అండదండలతోనే సాగుతున్నాయి. అందుకే అధికారులు మౌనం పాటిస్తూ కనీస పర్యవేక్షణ చేయకపోవడమే కాకుండా, బాధ్యత లేకుండా తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**- పొలాలకు వెళ్లే రహదారులు నాశనం ప్రమాదాల భయం**

నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టి తవ్వకాల కారణంగా చుట్టుపక్కల వ్యవసాయ భూములు సమతుల్యాన్ని



కోల్పోతున్నాయి. పొలాలకు వెళ్లే రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రతి రోజు ఈ ట్రాక్టర్లు, లారీల రాకపోకలతో గ్రామ రహదారులు బురదమయమవుతూ, శబ్ద కాలుష్యంతో వద్ధులు, చిన్నపిల్లలు ఆందోళనకు గురవుతున్నారు. లోతైన గుంతలు తవ్వటం వలన వర్షాలు పడినప్పుడు నీరు నిల్వ ఉండి పశువులు, కాపరులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. తవ్విన గుంతలు భద్రతకు ముప్పుగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- ఇదేం ప్రభుత్వమని ప్రశ్నిస్తున్న ప్రజలు**

సామాన్యులకు ఒక న్యాయం, రాజకీయ అండ ఉన్నవారికి మరొక న్యాయం ఇదేం ప్రభుత్వం అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అండదండలతో మట్టి మాఫియా బలపడుతోందని, దీనికి బలైపోతున్నది ప్రజల జీవనాధారం అయిన భూములు, నీటి వనరులేనని వాపోతున్నారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన అధికారులు మౌనం పాటించడం ప్రజల్లో తీవ్రమైన అనుమానాలకు దారితీస్తోంది. రాత్రింబవళ్లు అడ్డు అదుపు లేకుండా ఎటువంటి అనుమతులు లేకుండా సాగుతున్న ఈ అక్రమ మట్టి తవ్వకాలకు ఎవరు అడ్డుకట్ట వేస్తారో, ఎప్పుడు వేస్తారో అనేది ప్రజల్లో సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి దందాను అరికట్టి అక్రమ మట్టి మాఫియాపై సంబంధిత శాఖలు



స్పంధించి చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమా తవ్వకాలను అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రామకృష్ణను 'చర్చ' ప్రతినిధి వివరణ కోరగా ఎవ్వరికి కూడా మట్టి తవ్వకాలకు, తోలకాలకు అనుమతులు ఇవ్వలేదని, అక్రమ తవ్వకాల విషయం ఇప్పటివరకు తన దృష్టికి రాలేదని, ఎవ్వరైనా అక్రమ తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ముందస్తు చర్యలతో నష్టం తగ్గింది



**కృష్ణా జిల్లా, అక్టోబర్ 30:** జిల్లాలోని అవనిగడ్డ నియోజక వర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణపర్యటన కొనసాగుతోంది. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ముందస్తుగా తీసుకున్న చర్యలతో నష్ట నివారణ కొంత వరకు తగ్గించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. ప్రతి జిల్లా కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేశారని కొనియాడారు.మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యలు వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు.ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టి కి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన నీరు అధికారులు అప్రమత్తం



**అమరావతి, అక్టోబర్ 30:** మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటితో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకు వరద పోటెత్తింది. గురువారం బ్యారేజీకు 4.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉన్నతాధికారులు జారీ చేశారు. అయితే గురువారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద వరద నీరు మరింత వచ్చి చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సాయంత్రానికి 6 లక్షల క్యూసెక్కులకు వరద నీరు చేరే అవకాశం ఉందని అంటున్నారు.ఇక పులిచింతల ప్రాజెక్ట్ నుంచి 4 లక్షల 90 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కిందికి విడుదల చేశారు. మరో వైపు తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు మున్నేరు, కీసర, వైరా, కట్టలేరు ఉపనదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు కృష్ణనదిలోకి వచ్చి చేరింది. ఇలా రెండు వైపుల నుంచి వస్తున్న వరద నీటితో ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది.ఈ వరద నీటిని కిందికి విడుదల చేసేందుకు అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే మొంథా తుపాన్ కారణంగా.. కృష్ణనది పరివాహక ప్రాంతంలోని పలు ప్రాంతాలు వర్షపు నీటిలో చిక్కుకుపోయాయి. ఆ జాబితాలో గ్రామాలు, పంట పొలాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్యారేజీ నుంచి దిగువకు నీటికి విడుదల చేసేందుకు ఉన్నతాధికారులతో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఇక బ్యారేజీ దిగువనున్న లంక గ్రామాల ప్రజలను అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు.పరిశీలించిన మంత్రిమరోవైపు కృష్ణా నదితోపాటు దాని ఉప నదులకు భారీ వరద నీరు వచ్చి చేరడంతో. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నదిలోని వరద నీటి ప్రవాహాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు.కృష్ణా డెల్టా పరిధిలో అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, అనకాపల్లి, అల్లూరు సీతారా మరాజు జిల్లాల్లో వాగులు పొంగుతుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లను మంత్రి అప్రమత్తం చేసి.. తగు సూచనలు చేశారు.

## అపార పంట నష్టం బాధితులకు అండగా ప్రభుత్వం



**అనంతపురం:** మొంథా తుఫాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. తుఫాన్ గురించి ప్రధాని మోదీ స్వయంగా ఆరా తీశారని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అపార పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి, పంట నష్టం అంచనాలకు సర్వే బృందాలు పని చేస్తున్నాయని వివరించారు. పంట నష్టం జరిగిన రైతు లను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద సాయం అందేలా చర్యలు చేపడుతున్నట్లు అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. బీమా, లోన్ సౌకర్యాలు పథకంలో ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులను అన్ని విధులుగా ఆదుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఫసల్ బీమా యోజన రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలయ్యే లాగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వం దీనిని సక్రమంగా అమలు చేయలేక ఇబ్బందులు తలెత్తాయని ఆరోపించారు. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ పార్టీ తరఫున ఓ నోట్ తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని మాధవ్ వెల్లడించారు.కూటమి ప్రభుత్వంపై వైసీపీ మొదటి నుంచి వ్యతిరేక విధానాన్ని అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ విమర్శించారు. గూగుల్ వచ్చినప్పుడు, అంతకు ముందు ఇలానే మాట్లాడారని గుర్తు చేశారు. మొంథా విపత్కర పరిస్థితుల్లోనూ.. వ్యతిరేకంగా ప్రచారం చేశారని మండిపడ్డారు. తిరుమల దేవస్థానం ప్రాశస్త్యం తగ్గించే విధంగా గత ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. అక్రమాలపై విచారణ జరుగుతోం దని. అన్ని విషయాలపైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. శ్రీవాణి నిధులు, పరకామణి నిధులు సహా అనేక విషయాలపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ప్రభుత్వాని కోరారు.


# నెల తర్వాత మళ్లీ చురుగ్గా విజయ్

## - అన్నాడీఎంకేతో పొత్తు లేనట్టే



**చెన్నై:** కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు.బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని,మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీతో పొత్తు లేనట్లేనని సూచన ప్రాయంగా నిర్మల్‌కుమార్ తెలియజేశారు.

# రాష్ట్రంలో 2026 ఎన్నికల తర్వాత బీజేపీ అదృశ్యం



**చెన్నై:** వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ అదృశ్యమవుతుందని, డీఎంకే మళ్లీ అధికారం చేపడుతుందని మంత్రి రఘుపతి జోస్యం చెప్పారు. పుదుకోటలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.ఎస్ఐఆర్‌పై నవంబరు 2వ తేది అఖిలపక్ష సమావేశం తర్వాత ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారన్నారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించేలా ఎన్నికల సంఘాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తోందని ఆరోపించారు. బిహార్‌లోను ఇలాంటి ప్రయత్నం జరిగిందన్నారు. అలాంటి చర్యలను డీఎంకే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు.రాష్ట్రానికి ఉపాధి కోసం వచ్చే ఉత్తరాది కార్మికుల సంఖ్య లక్షల నుంచి కోటికి చేరిందన్నారు. తమిళనాడు అంటే తెలియనివారు, ఒకే ప్రాంతంలో శాశ్వతంగా ఉండనివారని రాష్ట్ర ఓటర్ల జాబితాలో చేర్చరాదని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. డీఎంకే ప్రభుత్వంపై బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. డీఎంకేను ప్రజలు ఆదరిస్తున్నారని, వారి ఆదరణతో రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మళ్లీ సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే 2.0 ప్రభుత్వం ఏర్పాటవుతోందని మంత్రి తెలిపారు.

# ట్రంప్ వ్యాఖ్యలను ఖండించే ధైర్యం మోదీకి లేదు- అదానీ, అంబానీ, ప్రధానిదే భారత్ : రాహుల్ గాంధీ



**న్యూ ఢిల్లీ :**భారత్-పాక్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించే ధైర్యం ప్రధాని మోదీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీతీశ్ కుమార్ పాలనలో బిహార్ పేపర్ లీకేజీలు, పేలవమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. బిహార్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూమి లేదని అమిత్ షా అన్న వ్యాఖ్యలపై రాహుల్ మండిపడ్డారు. అదానీ లాంటి వ్యాపారవేత్తలకు రూపాయికే భూమి ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీ ద్వారానే ఎన్‌డీఏ అధికారం చేపట్టిందని రాహుల్ మరోసారి ఆరోపించారు. రెండు భారత్?దేశాలు ఉన్నాయని, అందులో ఒకటి అదానీ, అంబానీ, మోదీలదే అని విమర్శించారు. మరొకటి తనది, ప్రజలదేని, ఏమి చేసినా ఉద్యోగాలు రావని పేర్కొన్నారు. గురువారం బిహార్‌లోని నలందలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ ప్రధాని మోదీపై ఈ మేరకు విరుచుకుపడ్డారు.'ఒక హిందూస్థాన్ అదానీ, అంబానీ, ప్రధాని మోదీలది. రెండో హిందూస్థాన్ మీది (ప్రజలు). రెండో దాంట్లో ఏమి చేసినా మీకు (ప్రజలు) ఉద్యోగాలు రావు. ఎందుకంటే ప్రధాని మోదీ అదానీ, అంబానీల చేత చైనా వస్తువులను విక్రయించాలని చూస్తున్నారు. వాటిని దేశ పౌరులతో పాటు బిహారీలు కొనుగోలు చేసేలా చూస్తున్నారు. ప్రధాని మోదీ ఇక్కడకు (బిహార్) వచ్చి యువతకు ఒక్క మాట చెప్పారు. బీజేపీ మొబైల్ డేటా ఛార్జీలను తగ్గించిందని చెప్పారు. తద్వారా యువత ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో రీల్స్ చేసుకుంటున్నారని చెప్పారు. నేను బిహార్ యువతను ఒక్కటి అడుగుతున్నాను. రీల్స్, ఇన్‌స్టా చూడటం ద్వారా ఏమైనా ప్రయోజనం ఉందా ఇన్‌స్టా చూస్తే మీ జేబులోకి డబ్బు చేరుతుందా మీరు ఇన్‌స్టా, ఫేస్‌బుక్ చూస్తే అంబానీ జేబులోకి డబ్బు వెళుతుంది' అని రాహుల్ గాంధీ అన్నారు.'ఇందీరా గాంధీ అంత ధైర్యం మోదీకి లేదు'ప్రధాని మోదీని భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పోల్చారు రాహుల్ గాంధీ. 1971 యుద్ధం సమయంలో ఇందిరా గాంధీ అమెరికా ముందు భయపడలేదని తలవంచలేదని, కానీ ప్రధాని మోదీకి ట్రంప్?ను ఎదిరించే సామర్థ్యం లేదని అన్నారు.' 1971 బంగ్లాదేశ్ యుద్ధంలో భారత్‌ను బెదిరించడానికి అమెరికా తన విమానాలను, నావికాదళాన్ని పంపింది. ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ, మీ నావికాదళానికి మేం భయపడం. మీరు చేయాల్సింది చేయండి. మేం చేయాల్సింది మేము చేస్తామని అన్నారు. ఇందిరా గాంధీ ఒక మహిళ. కానీ ఆమెకు ఒక పురుషుడి కంటే ఎక్కువ ధైర్యం ఉంది. నరేంద్ర మోదీ పిరికివారు. ఆయనకు అమెరికా అధ్యక్షుడిని ఎదిరించే సామర్థ్యం లేదు. నేను ఆయనను సవాలు చేస్తున్నా. నరేంద్ర మోదీకి ధైర్యం ఉంటే, బీహార్‌లో జరిగే ఏ సమావేశంలోనైనా , అమెరికా అధ్యక్షుడు అబద్ధం చెబుతున్నారని అని చెప్పాలి. అలాగే ఆపరేషన్ సిందూర్‌ను ఆపలేదని కూడా చెప్పాలి. కానీ ఆయన అలా చేయలేరు. ట్రంప్ ఇప్పటికే 50 సార్లు మోదీని అవమానించారు. కానీ ట్రంప్ అబు ద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదు. ట్రంప్‌ను కలిసే ఛాన్స్ మోదీకి వచ్చింది. కానీ, ఆయన భయంతో ఆయనను కలవడం లేదు. ఆయన అజ్ఞాతంలో కూర్చున్నారు. ప్రధానికి అంత ధైర్యం లేదు' అని రాహుల్ గాంధీ విమర్శించారు.

# ఆ ఉద్యోగాలకు రూ.35 లక్షల లంచం




**చెన్నై:** రాష్ట్ర నగరపాలన, తాగునీటి సరఫరా శాఖలలో ఉద్యోగాల ఎంపికల్లో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని, ప్రభుత్వ ఉద్యోగం కోసం రూ.35 లక్షల దాకా లంచం ఇచ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. నగరపాలన, తాగునీటి సరఫరా శాఖలో ఖాళీ పోస్టుల భర్తీలో భారీ యెత్తున అక్రమాలు జరిగాయని,ఈ అవినీతిలో సుమారు రూ.800 కోట్ల మేరకు అక్రమ నగదు బట్వాడా జరిగిందని ఈపీఎస్ పేర్కొన్నారు. రాష్ట్రమంతటా ఐటీ, ఈడీ జరిపిన సోదాల సందర్భంగా ఈ అవినీతి వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ అవినీతిలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, ఆయన సోదరులకు చెందిన సంస్థల అధికారులు కీలకపాత్ర పోషించారని, ఉద్యోగం కోసం వచ్చినవారి వద్ద రూ.25 లక్షల నుండి రూ.35 లక్షల దాకా లంచాలుగా స్వీకరించారని ఆరోపించారు.దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ జరపాలని ఆయన ఈడీకి విజ్ఞప్తి చేశారు. కాగా ఈపీఎస్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్త వాలని నగరపాలక శాఖా మంత్రి కేఎన్ నెహ్రూ తీవ్రంగా ఖండించారు. నగరపాలక శాఖలో ఉద్యోగాల పేరుతో ఎలాంటి ముడుపులు తీసుకోలేదని, ఈడీ జరిపిన దాడుల్లో గాని, సోదాల్లోగానీ తన శాఖలో అవినీతి అక్రమాలు జరిగినట్టు ఇప్పటి వరకు ఈడీ అధికారులు ఎలాంటి ప్రకటన కూడా చేయలేదని ఈ సందర్భంగా మంత్రి నెహ్రూ స్పష్టం చేశారు.

# ఆవిష్కరణల ఇంజిన్‌గా భారత్- ఆ దేశాలపై ఆధారపడడం తగ్గించుకుంటే బెటర్



**ఢిల్లీ :**స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, కీలక సాంకేతికతలపై నియంత్రణ వంటి విషయాలపై మిగతా దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్ సూచించారు. స్వదేశీ పిలుపనేది, కేవలం భారత్‌లో తయారీ గురించి కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధికి, సార్వభౌమత్వానికి ఇది దోహదప డుతుందని అన్నారు. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. భారత టెక్ స్టార్టప్‌లు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణను పొందుతున్నాయని పేర్కొన్నారు. 'స్వదేశీ సాంకేతికత, స్థిరమైన సరఫరా వ్యవస్థ వంటివి ఎంత ముఖ్యమో, కొవిడ్ మొదలయ్యాక జరిగిన అనేక పరిణామాలు చాటిచెప్పాయి. ఇంధన వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధాల విషయంలో ప్రపంచదేశాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడం దేశ అభివృద్ధికి చాలా ముఖ్యం. ఈ నేపథ్యం లోనే ప్రపంచానికి బ్యాక్ ఆఫీస్ లేదా సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌గా నిలవడం నుంచి ప్రపంచ ఆవిష్కరణల ఇంజిన్‌గా మారాలని భారత్ నిర్ణయించింది' అని పీయూశ్ గోయల్ వ్యాఖ్యానించారు. అయితే చమురు, సెమీకండక్టర్లు, అరుదైన ఖనిజాల విషయంలో న్న నేపథ్యంలో కేంద్రమంత్రి గోయల్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెమీకండక్టర్ల విషయానికొస్తే ఎగుమతుల్లో తైవాన్? అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ అవసరాల్లో 90 శాతం ఈ దేశమే సరఫరా చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులపై దాదాపు రూ.1.6 లక్షల కోట్లమేర పెట్టుబడులు పెడుతోంది. అదేవిధంగా 'ఇండియా సెమీకండక్టర్? మిషన్ 2.0'ని కూడా ప్రకటించింది.స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి: మోదీదేశ స్వయం సమృద్ధికి తోడ్పడే తదుపరి తరం సంస్కరణలు ఆగబోవని ప్రధాని నరేంద్ర మోదీ ఇదివరకే స్పష్టం చేశారు. 'వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) 2.0' అనేది దేశ వృద్ధికి మద్దతుగా నిలిచే డబుల్ డోస్ అని ఆయన పేర్కొన్నారు. ఈ సంస్కరణలతో మరింత వేగంగా ఆత్మనిర్భర భారత్ సాకారమవుతుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. స్వదేశీ/ స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా 'మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్' సాకారం చేయాలని మోదీ కోరారు. దేశీయ ఉత్పత్తుల వినియోగంతో దేశ రూపురేఖలు మారిపోతాయని తెలిపారు.

# ఓటరు జాబితా నుంచి పేరు తొలగిస్తారన్న భయంతో




**కోల్‌కతా:** అక్షర దోషం కారణంగా ఓటరు జాబితా నుంచి పేరు తొలగిస్తారన్న భయంతో ఒక రైతు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతడ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎలక్షన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) చేపడుతున్న పశ్చిమ బెంగాల్‌లో ఈ సంఘటన జరిగింది. కూచ్ బెహార్ జిల్లాలోని జీత్‌పూర్ ప్రాంతానికి చెందిన ఖైరుల్ షేక్ రైతు. ఓటరు కార్డులో అక్షర దోషం కారణంగా అతడి పేరు షేక్ బదులు సేఖ్‌గా ఉన్నది.కాగా, బెంగాల్‌లో సర్ ప్రక్రియ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అక్షర దోషం కారణంగా ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగిస్తారేమోనని రైతు ఖైరుల్ షేక్ ఆందోళన చెందాడు. బుధవారం పొలంలో పని చేస్తుండగా పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తొలుత దిన్హాటాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కూచ్ బెహార్‌లోని ఎంజేఎన్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.మరోవైపు మంగళవారం ఉత్తర 24 పరగణాల జిల్లాలో 57 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మరణించాడు. జాతీయ పౌర నమోదు (ఎన్నార్సీ) తన మరణానికి కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. బెంగాల్‌లో సర్ ప్రక్రియ గురించి నుంచి అతడు ఆందోళన చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు వాపోయారు.

# 20 మంది పిల్లలను స్టూడియోలో బంధించిన వ్యక్తి పోలీస్ కాల్పుల్లో మృతి





**ముంబై:** ఒక వ్యక్తి సుమారు 20 మంది పిల్లలను స్టూడియోలో నిర్బంధించాడు. తన డిమాండ్ల కోసం కొందరితో మాట్లాడాలంటూ వీడియో రిలీజ్ చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. చివరకు పోలీస్ కాల్పుల్లో ఆ వ్యక్తి మరణించాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. పోవై ప్రాంతంలోని ఆర్ఏ స్టూడియోలో యాక్టింగ్ క్లాసులు జరుగుతుంటాయి.కాగా, రోహిత్ ఆర్య అనే వ్యక్తి ఆ స్టూడియోలో పని చేస్తున్నాడు. అతడికి యూట్యూబ్ ఛానెల్ కూడా ఉన్నది. గత నాలుగు రోజులుగా రోహిత్ ఆడిషన్లు నిర్వహిస్తున్నాడు. దీంతో గురువారం ఉదయం సుమారు వంద మంది పిల్లలు ఆడిషన్ల కోసం ఆ స్టూడియోకు వచ్చారు. అయితే 80 మంది పిల్లలను అతడు బయటకు వెళ్లనిచ్చాడు. సుమారు 20 మంది పిల్లలను స్టూడియో లోపల ఉంచి నిర్బంధించాడు. దీంతో తమను కాపాడాలంటూ వారు హాహాకారాలు చేశారు.మరోవైపు రోహిత్ ఆర్య ఆ తర్వాత ఒక వీడియో క్లిప్ విడుదల చేశాడు. కొంత మంది వ్యక్తులతో మాట్లాడటం కోసమే పిల్లలను బందీలుగా ఉంచినట్లు తెలిపాడు. తనకు పెద్దగా ఆర్థిక డిమాండ్లు లేవని చెప్పాడు. తన డిమాండ్లు నైతికమైనవని అన్నాడు. పోలీసులు, అధికారులు దూకుడుగా వ్యవహరించ వద్దని, తనను రెచ్చగొట్టవద్దని హెచ్చరించాడు. తన డిమాండ్లు నెరవేర్చకపోతే ఆ ప్రాంగణానికి నిప్పు పెడతానని, తనతో పాటు పిల్లలకు హాని జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు.కాగా, పిల్లల కిడ్నాప్, నిర్బంధం గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో ఆ స్టూడియో ముందు గుమిగూడారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసి నిర్బంధించిన రోహిత్ ఆర్యతో మాట్లాడారు.రోవైపు పిల్లలందరినీ రక్షించి వారి కుటుంబాలకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడు ఎందుకు ఇలా చేశాడు అన్నది తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మానసికంగా అస్థిరంగా ఉన్నట్లు వెల్లడించారు. అయితే పోలీస్ కాల్పుల్లో గాయపడిన అతడ్ని హాస్పిటల్‌కు తరలించగా మరణించాడు. ఈ సంఘటన ముంబైలో కలకలం రేపింది.

# రూ.కోట్లు కుమ్మరించినా పడని వర్షం



**ఢిల్లీ :** నవంబర్ వచ్చిందంటే చాలు ఢిల్లీ వాసులకు దడే. రాజధాని ప్రాంతంలో ఏటా అక్టోబర్ చివరి నుంచే వాయు కాలుష్యం గరిష్ఠ స్థాయికి చేరుతుం టుంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా రైతులు పంటల వ్యర్థాలు తగలబెట్టడా నికి తోడు, చలికాలం కావడంతో దట్టమైన పొగ మంచు కార ణంగా ఢిల్లీలో గాలి నాణ్యత క్షీణిస్తుంది. ఈసారి కూడా దీపావళికి ముందే వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయికి చేరింది. దీంతో కాలుష్యం కట్టడికి రేఖా గుప్తా నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.ఇందులో భాగంగానే దాదాపు 53 ఏండ్ల తర్వాత ఢిల్లీలో కాలుష్య స్థాయిలను పెంచేందుకు క్లౌడ్ సీడింగ్ నిర్వహించింది. దీని ద్వారా కృత్రిమ వర్షం కురిపించేందుకు ఏర్పాట్లు చేసింది. ఐఐటీ కాన్పూర్ సహకారంతో బురారి, ఉత్తర కరోల్ బాగ్, మయూర్ విహార్, బద్లి సహా పలు ప్రాంతాల్లో ట్రయల్స్ నిర్వహించింది. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చుపెట్టింది. అయితే, ప్రభుత్వం చేసిన ఈ ప్రయత్నం విఫలమైంది. ప్రక్రియ పూర్తయినా వర్షం కురవలేదు.ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌తో ఐఐటీ కాన్పూర్ తొమ్మిది ట్రయల్స్ నిర్వహించాలని భావించింది. అయితే, ఇప్పటికే నిర్వహించిన ట్రయల్స్ ఫెయిల్ అవ్వడంతో ఆ ప్రయత్నాన్ని ఢిల్లీ ప్రభుత్వం మధ్యలోనే ఆపేసింది. ఈ ప్రయోగం ఖర్చుతో కూడుకున్నదని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ తెలిపారు. విమాన నిర్వహణ, పైలట్ ఫీజులు, ఇంధన ఖర్చులు వంటివి ఉంటాయని పేర్కొన్నారు. కాలుష్యం కట్టడికి ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి అయ్యే ఖర్చు కొంచెం ఎక్కువే అని వెల్లడించారు. ఇక శీతాకాలం మొత్తం దేశ రాజధానిపై క్లౌడ్ సీడింగ్‌కు దాదాపు రూ.25 నుంచి రూ.30 కోట్ల వరకూ ఖర్చవుతుందని ఆయన అంచనా వేశారు.ఏమిటీ కృత్రిమ వర్షం!ఆకాశంలో కనిపించే ప్రతి నల్లమబ్బూ%ూ% కురవదు. ఊరించి వెళ్లేవే ఎక్కువ. మబ్బులలో ఉండే వర్షపు చుక్కలు తగినంత దట్టంగా లేకపోతే, అవి తేలిపోతాయి. మబ్బు భారమైనప్పుడే, అందులోని నీటి బిందువులు లేదా మంచుగడ్డలు నేల మీదకు జారతాయి. మబ్బులలో సాంద్రతను పెంచాలి అంటే%ూ% దూరదూరంగా ఉన్న నీటి బిందువులు దగ్గర కావాలి లేదా అవి ఘనీభవించి మంచుగా మారాలి.

# ఆ సాకుతో బీమా పరిహారం ఇవ్వమంటే కుదరదు




**ఢిల్లీ :**బీమా పరిహారం చెల్లింపుల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. వాహనం రూట్ తప్పిందని. పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించినందున ప్రమాద బాధితులకు బీమా కంపెనీలు పరిహారాన్ని తిరస్కరించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరిహారాన్ని కంపెనీలు తిరస్కరించడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. బీమా పాలసీ ఉద్దేశం రక్షణ కల్పించడమే తప్ప.. సాకులు చెప్పడం కాదని కోర్టు వ్యాఖ్యానించింది. బీమా పాలసీ ఉద్దేశం వాహన యజమాని లేదంటే ఆపరేటర్‌ను థర్డ్ పార్టీకి హాని కలిగించే.. ఊహించని, లేదంటే దురదృష్టకర సంఘటనల నుంచి రక్షించడమని. పర్మిట్ ప్రాంతం వెలుపల ప్రమాదం జరిగినం దున బాధితుడికి, వారి కుటుంబాలకు పరిహారం నిరాకరించడం న్యాయానికి విరుద్ధమని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం తెలిపింది.ప్రమాదంలో బాధితుడి తప్పిదం లేదని.. అలాంటి సమయంలో అతనికి పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది. సంబంధిత పరిహారాన్ని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకోవచ్చని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సరైనవేనని తెలిపింది. 2014 నాటి కేసులో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 2014 అక్టోబర్ 7న కర్నాటకలో ఓ బస్సు మోటార్ సైకిలిస్ట్‌ను ఢీకొట్టింది. ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మరణించాడు. ఈ కేసులో బాధితుడికి వడ్డీతో కలిపి రూ.18.86లక్షల పరిహారం ఇవ్వాలని మోటార్ యాక్సిడెంట్ లెక్కించలేదని పిటిషనర్.. ప్రమాదానికి కారణమైన వాహనం రూట్ పర్మిట్‌ను ఉల్లంఘించిందని బీమా కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఉల్లంఘించినప్పటికీ బీమా కంపెనీ పరిహారం చెల్లించాలి' అని ఆదేశించింది. సుప్రీంకోర్టు నిర్ణయం భవిష్యత్‌లో ఇలాంటి కేసుల్లో ఒక ఉదాహరణగా నిలువనున్నది.

# ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

**మెల్‌బోర్న్ వేదికగా నేడు రెండో టీ20**

**ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగనున్న భారత్**

**అర్ష్‌దీప్ సింగ్‌ను జట్టులోకి తీసుకునే చాన్స్**



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వరణుడు మింగేయడంతో టీమిండియా మరో ఆసక్తికరమైన పోరుకు సిద్దమైంది. మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరిగే రెండో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు దుమ్మురేపారు. అదే జోరును రెండో టీ20లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. తొలి టీ20లో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు ఓ పేస్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో టీ20లో తమ కాంబినేషన్‌ను మార్చుకునే ఛాన్స్ ఉంది.మెల్ బోర్న్ పిచ్ సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది బౌన్సీ పిచ్. బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకుంటారు. మైదానం పెద్దది కాబట్టి స్పిన్నర్లు వికెట్లు తీయకపోయినా.. పరుగులు నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. పిచ్ కండిషన్స్‌ను పరిగణలోకి తీసుకుంటే.. టీమిండియా ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగవచ్చు. అప్పుడు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. అదనపు పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు.ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి టీ20లో ఈ ఇద్దరు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఏడాది పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చాడు. తనకు అచ్చొచ్చిన ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగి దుమ్మురేపాడు. తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ కొనసాగనుండగా.. వికెట్ కీపర్‌గా సంజూకు ప్రాధాన్యత దక్కనుండటంతో జితేష్ శర్మకు మరోసారి నిరాశే ఎదురు కానుంది.స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. తొలి టీ20లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను ఆడించడం విమర్శలకు దారి తీసింది. కానీ అతను బ్యాటింగ్ చేయడంతో పాటు ఆసీస్ కండిషన్స్‌లో బాగా రాణించగలడనే కారణంతో తుది జట్టులోకి తీసుకున్నారు. మరోసారి బుమ్రాకు తోడుగా అతన్నే కొనసాగించనున్నారు.రెండో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి/అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత టీ20 జట్టు:సూర్య కుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.

# పెళ్లి పీటలు ఎక్కనున్న స్మృతి మంధాన



భారత మహిళా క్రికెట్ జట్టు వైస్-కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్న సంగతి తెలిసిందే. ఆమె తన ప్రియుడు, ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్ఛల్ ను వివాహం చేసుకోబోతున్నారు. ఈ సందర్భంగా వారి పెళ్లి వేడుకలు స్మృతి మంధాన సొంత ప్రాంతం సాంగ్లీ లో మొదలుకానున్నాయంట. నవంబర్ 20న వివాహ వేడుకలు ప్రారంభమవుతాయని టైమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ నివేదించింది. 2019లో డేటింగ్ ప్రారంభించిన స్మృతి, పలాష్, జులై 2024లో వీరి ఐదవ వార్షికోత్సవం సందర్భంగా భావోద్వేగ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను పంచుకోవడం ద్వారా వారి సంబంధాన్ని బహిరంగపరిచారు. మహారాష్ట్రలోని సాంగ్లీ ప్రాంతం స్మృతి మంధాన సొంత ఊరు. అందుకే ఆమె వివాహ వేడుకలను ఇక్కడి నుంచే ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. నవంబర్ 20న వేడుకలు మొదలుకానున్నాయంట. ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొనే విధంగా ఈ వివాహ వేడుక జరగనుంది. స్మృతి మంధాన, పలాష్ ముచ్ఛల్ సుమారు ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సోషల్ మీడియాలో వీరిద్దరూ తరచుగా కలిసి దిగిన ఫొటోలు పంచుకుంటూ అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఇటీవల పలాష్ ముచ్ఛల్ స్వయంగా వీరి పెళ్లిని ధృవీకరించారు. ఇండోర్ నుంచి వచ్చిన పలాష్ ముచ్ఛల్%ౌ% "స్మృతి త్వరలో ఇండోర్‌కు కోడలు కాబోతోంది" అంటూ నవ్వుతూ ప్రకటించారు. ఈ ప్రకటనతో అభిమానులు, క్రికెట్ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.క్రికెట్‌లో తన కవర్ డ్రైవ్‌లు, మెరుపు బ్యాటింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్మృతి మంధాన.. ఇకపై సంగీత ప్రపంచంతో బంధుత్వం కలుపుకోబోతున్నారు. పలాష్ ముచ్ఛల్ బాలీవుడ్‌లో మంచి పేరున్న సంగీత

# నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను

**• భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్**



సిడ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై తాజా సమాచారం ఇచ్చారు. గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో ఉన్న అయ్యర్ ప్రస్తుతం కోలుకుంటున్నట్లు తెలిపారు. దీని గురించి శ్రేయాస్ అయ్యర్ సోషల్ మీడియా పోస్ట్‌ను షేర్ చేస్తూ, "నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను. రోజురోజుకూ మెరుగుపడుతున్నాను. మీ నుంచి నాకు లభించిన మద్దతుకు నేను చాలా కృతజ్ఞుడను. నన్ను మీ ఆలోచనల్లో ఉంచుకున్నందుకు ధన్యవాదాలు" అంటూ శ్రేయాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దీంతో శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. ఆయన కోలుకుంటున్నందున, డిశ్చార్జ్ అయి మరో వారంలో భారతదేశానికి తిరిగి రావొచ్చు. ముంబైలో ఆయన చికిత్స కొనసాగించే అవకాశం కూడా ఉంది. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో, హర్షిత్ రాణా వేసిన బంతిని అలెక్స్ కారీ అద్భుతమైన షాట్ కొట్టాడు. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో నిలబడి ఉన్న అయ్యర్ వేగంగా పరిగెత్తి డైవింగ్ క్యాచ్ తీసుకున్నాడు. ఈ డైవింగ్ సమయంలో, అతని ఎడమ పక్కటెముకలకు తీవ్ర గాయం అయింది. దీని వల్ల అతని ప్లీహము (ప్లీహము) పైన ఉన్న అవయవంలో అంతర్గత రక్తస్రావం జరిగింది. దీని కారణంగా, అతను అస్వస్థతకు గురయ్యాడు. స్కానింగ్ నివేదికలో శ్రేయాస్ అయ్యర్ ప్లీహములో కొంత భాగం చీలిపోయినట్లు తేలింది. అందువల్ల, అతను ఇంటర్వెన్షనల్ ట్రాన్స్-కాథెటర్ ఎంబోలైజేషన్ చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, ఐసీయూ నుంచి వార్డుకు మార్చారని సమాచారం. శ్రేయాస్ అయ్యర్ మరో వారం రోజుల్లో భారత్ కు తిరిగి వస్తారని సమాచారం. ప్రస్తుతం వైద్య పర్యవేక్షణలో ఉన్న శ్రేయాస్ అయ్యర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలు పడుతుందని తెలిసింది. అందుకే, నవంబర్‌లో జరగనున్న దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ కనిపించడు. జనవరి నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లయితే మాత్రమే అతను న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో కూడా కనిపిస్తాడు.

# నల్ల బ్యాండ్స్‌తో భారత్, ఆసీస్ ఆటగాళ్లు..

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న సెమీఫైనల్లో ఇరు జట్ల ఆటగాళు నల్ల బ్యాండ్స్ ధరించి బరిలోకి దిగారు. 17 ఏళ్ల ఆసీస్ యువ క్రికెటర్ బెన్ ఆస్టిన్ అకాల మృతికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు బ్లాక్ ఆర్మ్ బ్యాండ్స్ ధరించారు. మెల్‌బోర్న్‌లో ప్రాక్టీస్ నెట్ సెషన్‌లో బంతి మెడ భాగంలో బలంగా తగలడంతో ఆస్టిన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా దివంగత క్రికెటర్ ఫిలిప్ హ్యూస్ మరణ ఉదంతాన్ని గుర్తు చేసిన ఈ ఘటన యావత్ క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. 17 ఏళ్ల బెన్ ఆస్టిన్ మంగళవారం మధ్యాహ్నం ఫర్న్‌ట్రీ గల్లీలోని వ్యాలీ ట్యూ రిజర్వ్‌లో శిక్షణ తీసుకుంటుండగా ఈ విషాదకర సంఘటన జరిగింది. క్రికెట్ ఆస్ట్రేలియా వివరాల ప్రకారం.. ఈ యువకుడు నెట్స్‌లో హెల్మెట్ ధరించి బౌలింగ్ మెషీన్ ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా.. బంతి అతని మెడ భాగంలో బలంగా తాకింది. దాంతో ఆస్టిన్ క్రీజులోనే కుప్పకూలిపోగా.. అతన్ని హుటాహుటిన మోనాష్ మెడికల్ సెంటర్‌కు తరలించారు. తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ బుధవారం ఆస్టిన్ తుదిశ్వాస విడిచాడు. 2014లో ఫిలిప్ హ్యూజ్ కూడా ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లో ఇలానే గాయపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆసీస్ బ్యాటింగ్ ఎంచుకోగా.. టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగింది. గత మ్యాచ్‌లో గాయపడి జట్టుకు దూరమైన ప్రతికా రావల్ స్థానంలో షెఫాలీ వర్మ తుది జట్టులోకి రాగా.. రిచా ఘోష్, క్రాంతి గౌడ్ రీఎంట్రీ ఇచ్చారు. హర్లీన్ డియోల్‌పై వేటు పడగా.. ఉమా ఉద్వాసనకు గురైంది.

# సంజూ శాంసన్ జట్టులో అత్యంత దురదృష్టవంతుడు

**• మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్**



వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్ భారత జట్టులో అత్యంత దురదృష్టవంతుడని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. తరుచూ అతని బ్యాటింగ్ ఆర్డర్‌ను మారుస్తున్నారని, దాంతో సంజూ బ్యాటింగ్ రిథమ్‌తో పాటు ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందన్నాడు. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో ఓపెనర్‌గా ఆడిన సంజూ శాంసన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో 3 శతకాలు సాధించాడు. గిల్ రాకతో మళ్లీ మిడిలార్డర్‌కు మారిన సంజూ శాంసన్.. ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో స్థానంలో ఆడుతున్నాడు.కొన్నిసార్లు నెంబర్ 3లో ఆడితే.. మరికొన్ని సార్లు నెంబర్5, నెంబర్ 8లో ఆడుతున్నాడు. తాజాగా ఆస్ట్రేలియాతో తొలి టీ20లోనూ సంజూ శాంసన్ మిడిలార్డర్‌కే పరిమితమయ్యాడు. దాంతో అతని బ్యాటింగ్ ఆర్డర్‌పై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన క్రిష్ శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బ్యాటింగ్ విషయంలో సంజూ శాంసన్‌తో టీమిండియా మేనేజ్‌మెంట్ మ్యూజికల్ చైర్ ఆడుతుందని విమర్శించాడు.'టీమిండియాలో దురదృష్టవంతుడు ఎవరైనా ఉన్నారంటే అది సంజూ శాంసనే. ఓపెనర్‌గా అతను శతకాలు బాదాడు. కానీ ప్రస్తుతం అతన్ని మూడో స్థానం నుంచి 8వ స్థానం వరకు బ్యాటింగ్‌కు పంపిస్తున్నారు. అవకాశం ఉంటే అతన్ని 11వ స్థానంలో కూడా ఆడించేలా ఉన్నారు. సంజూ శాంసన్ వంటి వ్యక్తులకు ఇది నిజంగా బాధకు గురిచేస్తోంది. టాపార్డర్‌లో మెరుగ్గా రాణించిన తర్వాత కూడా అతనికి సరైన బ్యాటింగ్ పొజిషన్ లేదు. అతనికి ఎలాంటి ఆప్షన్ కూడా లేదు. ఎక్కడ ఆడమంటే అక్కడ ఆడాల్సిన పరిస్థితి. మంచి విషయం ఏంటంటే ఆసియా కప్‌లో నెంబర్ 5లో కూడా అతను రాణించాడు. ఇది అతనికి శుభసూచకం. ఎందుకంటే ఇప్పుడు సంజూ శాంసన్ టీ20 వరల్డ్ కప్ 2026కు ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా మారిపోయాడు. నెంబర్ 5లోనే కచ్చితంగా బ్యాటింగ్ చేస్తాడు.'అని క్రిష్ శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు. ఓపెనర్‌గా 12 ఇన్నింగ్స్‌లు ఆడిన శాంసన్ 37.90 సగటు, 183.70 స్ట్రైక్‌రేట్‌తో 471 పరుగులు చేశాడు. అభిషేక్ శర్మతో కలిసి అదిరిపోయే ఆరంభాలు అందించాడు. కానీ శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా జట్టులోకి తిరిగి రావడంతో సంజూ తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసియా కప్ 2025లో మిడిలార్డర్‌లోనూ సంజూ శాంసన్ సత్తా చాటాడు. ప్రస్తుతం



# ముగ్గురు వికెట్ కీపర్లపై కన్నేసిన సీఎస్కే!

2026 సీజన్ కోసం చాలా అంచనాలు ఉన్నాయి. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ క్రికెటర్లు మరోసారి ఐపీఎల్‌లో ఆడనున్నారు. ఈ కారణంగా క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కానీ, ధోనీ ఆడే అవకాశం చాలా తక్కువగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ముగ్గురు వికెట్ కీపర్లను సొంతం చేసుకునేందుకు కన్నేసినట్లు తెలుస్తోంది.2026 సీజన్ కోసం ఒక మినీ వేలం జరుగుతోంది. డిసెంబర్ రెండవ వారంలో మినీ వేలం జరుగుతుందని చెబుతున్నారు. డిసెంబర్ 13-15 మధ్య జరుగుతుందని చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఐపీఎల్ వేలం జరుగుతుండగా, ఈసారి భారతదేశంలో జరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఇది ముంబైలో జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.నవంబర్ 15 నాటికి ప్రతి జట్టు ఐపీఎల్ మినీ వేలం కోసం నిలుపుకునే ఆటగాళ్ల జాబితాను ఖరారు చేస్తుందని చెబుతున్నారు. ఇంకా 15 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, ఏ జట్లు



ఐపీఎల్ మినీ వేలం కోసం ఏ ఆటగాళ్లను విడుదల చేస్తాయి మినీ వేలంలో వారు ఏ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుంటారుఅదే సమయంలో, గత మెగా వేలంలో ఎవరూ తీసుకోని ఆటగాళ్లు, గత ఐపీఎల్ సిరీస్‌లో తాత్కాలిక ప్రత్యామ్నాయాలుగా ఆడిన వారు మినీ వేలానికి వస్తారని భావిస్తున్నారు. అదే సమయంలో, గాయం కారణంగా గత మెగా వేలంలో పాల్గొనని కామెరాన్ గ్రీన్ వంటి ఆటగాళ్లు కూడా మినీ వేలంలోకి ప్రవేశిస్తారు. ఈ మినీ వేలంలో చాలా మంది ఆటగాళ్లకు అధిక డిమాండ్ ఉంటుంది. ఆ విషయంలో, ఐపీఎల్ మినీ వేలంలో అత్యధిక మొత్తానికి వేలం వేయబడే అవకాశం ఉన్న 3 వికెట్ కీపర్ల జాబితా ఇక్కడ ఉంది.గత మెగా వేలంలో ఇంగ్లాండ్ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ జానీ బెయిర్‌స్టోను ఎంపిక చేయలేదు. అయితే, ముంబై ఇండియన్స్‌కు చెందిన ర్యాన్ రికిల్టన్‌ను ఐపీఎల్ సమయంలో అంతర్జాతీయ మ్యాచ్‌ల కోసం విడుదల చేసినప్పుడు, జానీ బెయిర్‌స్టో తాత్కాలిక స్థానంలో ఆడాడు. గత సీజన్‌లో ముంబై తరపున 2 ప్లే-ఆఫ్ మ్యాచ్‌లలో ఆడటం ద్వారా అతను చాలా మంది దృష్టిని ఆకర్షించాడు. అనుభవజ్ఞుడైన ఆటగాడిగా కేకేఆర్, రాజస్థాన్ రాయల్స్ అతన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. అతను ఓపెనర్ కాబట్టి సీఎస్‌కే కూడా ప్రయత్నించే అవకాశం ఉంది. గత మెగా వేలంలో న్యూజిలాండ్ వికెట్ కీపర్-బ్యాట్స్‌మాన్ టిమ్ సీఫెర్ట్ ను ఏ జట్టు కూడా ఎంపిక చేయలేదు. అయితే చివరి నిమిషంలో అంతర్జాతీయ మ్యాచ్ ల కోసం ఆర్సీబీ నుండి విడుదల చేయగా.. అతడి స్థానంలో ఇంగ్లాండ్ ఆటగాడు జాకబ్ బెథెల్ స్థానంలో తాత్కాలిక స్థానంలో కూడా అతన్ని ఎంపిక చేశారు. అయితే, గత సీజన్ లో సీఫెర్ట్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అతను 2021, 2022 సీజన్లలో కేవలం 3 మ్యాచ్ లు మాత్రమే ఆడి 36 పరుగులు చేశాడు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్ లలో ఆడుతున్నాడు. ఈ మినీ వేలంలో కూడా అతనికి డిమాండ్ ఉంటుంది. అతను ఓపెనర్ కాబట్టి చెన్నై, కేకేఆర్ కూడా అతనితో ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తాయి. భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్‌లకు ఎప్పుడూ అధిక డిమాండ్ ఉంటుంది. అయితే, గత మెగా వేలంలో నారాయణ్ జగదీశన్‌ను ఏ జట్టు కూడా ఎంపిక చేయలేదు.

# అమితాబ్ మనవడి 'ఇక్కీస్'.. ఆకట్టుకుంటున్న ట్రైలర్




బాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన బయోపిక్ రాబోతోంది. దేశ అత్యున్నత సైనిక పురస్కారం 'పరమవీర చక్ర'ను అతి పిన్న వయసులో అందుకున్న వీర సైనికుడు, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితం ఆధారంగా 'ఇక్కీస్' అనే చిత్రం తెరకెక్కుతోంది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద ఈ చిత్రంలో అరుణ్ ఖేతర్‌పాల్ పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.'అంధాధున్' వంటి విజయవంతమైన చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న శ్రీరామ్ రాఘవన్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దిగ్గజ నటుడు ధర్మేంద్ర, 'పాతాళ్ లోక్' ఫేం జైదీప్ అహ్లావత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విడుదలైన ట్రైలర్, 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధ సన్నివేశాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. యుద్ధభూమిలో అరుణ్ ఖేతర్‌పాల్ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమను ట్రైలర్‌లో ఆవిష్కరించారు.కేవలం 21 ఏళ్ల వయసులోనే దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అరుణ్ ఖేతర్‌పాల్ త్యాగాన్ని ఈ సినిమా గుర్తు చేయనుంది. ఆయన అసమాన పరాక్రమానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం మరణానంతరం పరమవీర చక్ర పురస్కారంతో సత్కరించింది. ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# అలా చెప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు: రవితేజ

రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' సినిమా రూపొందింది. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీమ్ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. తాజా ఇంటర్వ్యూలో భాను భోగవరపు మాట్లాడుతూ, "నేను రవితేజ గారి అభిమానిని. అయన సినిమాలలో నాకు 'వెంకీ' అంటే చాలా ఇష్టం. ఆయనతోనే నా ఫస్టు మూవీ ఉంటుందని నేను అసలు ఊహించలేదు" అని చెప్పారు. ఈ సినిమాకి 'మాస్ జాతర' అనే టైటిల్ పెట్టింది రవితేజ గారే. ఇది సాలీడ్ టైటిల్ కావడంతో, అందుకు తగినట్టుగా సీన్స్ ను డిజైన్ చేసుకోవడం జరిగింది. ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. ఇక హైపర్ ఆది మాట్లాడుతూ .. 'ధమాకా' తరువాత నుంచి రవితేజ గారి సినిమాలలో వరుసగా చేస్తూ వెళుతున్నాను. ఈ సినిమాలు రవితేజగారితో కలిసి నేను చేసే కామెడీ ఆడియన్స్ కి నచ్చుతుంది" అని అన్నారు. ఇక రవితేజ మాట్లాడుతూ .. " వేరే ఏ విషయం గురించి మాట్లాడమని చెప్పినా మాట్లాడతాను. కానీ నా గురించి .. నా సినిమాను గురించి మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు. ఇలా వచ్చేస్తున్నాయ్ .. అలా వచ్చేస్తున్నాయ్ .. బాగా వచ్చేస్తున్నాయ్ అన్ని నేను చెప్పలేను. భాను డైరెక్షన్ .. అతని రైటింగ్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందనేది మాత్రం నిజం. ఒకటి మాత్రం చెప్పగలను .. మనకి మరో కమర్షియల్ డైరెక్టర్ వస్తున్నాడు" అని అన్నారు.



# కొత్త గెటప్ లో ఆషికా !

ఆషికా రంగనాథ్.. ఈ హీరోయిన్ తెలుగులో చేసినవి 2 సినిమాలే అయినప్పటికీ స్టార్ హీరోయిన్ మాదిరి గుర్తింపు సంపాదించింది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.ఎప్పుడు పొట్టి పొట్టి బట్టలతోనో లేక ట్రెడిషనల్ డ్రెస్ లతోనో కనిపించే ఆషికా రంగనాథ్ ఒక్కసారిగా గెటప్ చేంజ్ చేసేసరికి ఈ హీరోయిన్ ఫొటోస్ చూసిన అభిమానులు సైతం షాక్ అవుతున్నారు.ఇదేంటి ఈ హీరోయిన్ గెటప్ మార్చేసింది.. ఈ కొత్త గెటప్ ఏంటో అంటూ ఆశ్చర్యపోతున్నారు.ఇక తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.ఆ ఫొటోస్ లో ఆషికా రంగనాథ్ గెటప్ పూర్తిగా చేంజ్ అయింది. హాలీవుడ్లో పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్ అనే సినిమాలో హీరో ఎలా అయితే ఉంటారో అచ్చం ఆ హీరోని పోలి ఉన్న గెటప్ లో ఆషికా రంగనాథ్ తాజా ఫోటోలు ఉన్నాయి. తలకి బ్యాండ్ కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకొని ఆషికా రంగనాథ్ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూస్తూ ఉంటే మాత్రం ఆషికా రంగనాథ్ ఏదో స్టంటులు చేసేవారు ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లుగా ఉంది. అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఆషికా రంగనాథ్ పోస్ట్ చేసిన ఫోటోలలో వెనుక ఉన్న బ్యాక్గ్రౌండ్ కూడా అలాగే ఏదో యాక్షన్ మూవీ సెట్ వేసినట్టు కనిపిస్తోంది. చూస్తుంటే ఆషికా రంగనాథ్ కొత్త సినిమా కోసం అలా తన గెటప్ ని చేంజ్ చేసినట్టు కనిపిస్తోంది. మరి ఆషికా రంగనాథ్ తాజా ఫొటోస్ కొత్త సినిమా గెటప్ లో భాగమేనా అనేది తెలియాల్సి ఉంది.

ఇక ఈ ఫొటోస్ షేర్ చేయడంతో పాటు ఈ ఫొటోస్ కి క్యాప్షన్ గా ఈ మొత్తం లుక్ వెనక ఉన్న బృందానికి లవ్ యు అన్నట్లుగా ఫింగర్ హాట్ సింబల్ ఎమోజిని కూడా షేర్ చేసింది.. ప్రస్తుతం ఆషికా రంగనాథ్ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.మరి హీరోయిన్ సడెన్ గా గెటప్ చేంజ్ వెనుక కారణం ఏంటో తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్‌లో ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ మరోసారి హైదరాబాద్ సంగీత ప్రియులను తన స్వరాలతో అలరించనున్నారు. నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా ఆయన భారీ లైవ్ కాన్సర్ట్ నిర్వహించబోతున్నారు. హైదరాబాద్ టాకీస్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో రెహమాన్ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ, "హైదరాబాద్ అత్యంత డైనమిక్ నగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి ప్రజలు



లైవ్ కాన్సర్ట్‌లను ఎంతగానో ఆదరిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా ప్రేక్షకులు నిజమైన సంగీత అనుభూతి కోసం ఇలాంటి కార్యక్రమాలకు రావడం కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది" అని అన్నారు. ఇది సంగీతం పట్ల ప్రజలకు ఉన్న ప్రేమకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ టాకీస్ వ్యవస్థాపకుడు సాయినాథ్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రేక్షకులకు ప్రపంచ స్థాయి సంగీత అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. ఈ ఏడాది ఆరంభంలో ఎం.ఎం. కీరవాణితో కార్యక్రమం నిర్వహించాం. ఇప్పుడు రెండోసారి ఏఆర్ రెహమాన్‌ను నగరానికి తీసుకురావడం గర్వంగా ఉంది. ఈ ఈవెంట్ కోసం దీపక్ చౌదరి, ఇవా లైవ్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని తెలిపారు.భారతీయ సంగీతాన్ని ప్రపంచ వేదికలపై వినిపించిన రెహమాన్, తన లైవ్ ప్రదర్శనలతో ఇప్పటికే ఎంతో మందిని మంత్రముగ్ధులను చేశారు.

# రష్మిక మందన్నకు మరో హిట్.. వంద కోట్ల క్లబ్ లో చేరిన బాలీవుడ్ మూవీ

పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న మరో హిట్ సినిమాను తన ఖాతాలో వేసుకుంది. బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటించిన హారర్ కామెడీ చిత్రం 'థమ్మా' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. సెప్టెంబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, 100 కోట్ల క్లబ్ లో చేరింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 9వ రోజు (అక్టోబర్ 29న) ఈ చిత్రం కేవలం రూ. 3.25 కోట్లు వసూలు చేసింది. దీంతో సినిమా మొత్తం వసూళ్లు రూ. 104.60 కోట్లకు చేరాయి. రెండో బుధవారం హిందీలో ఈ చిత్రానికి 10.10% ఆక్యుపెన్సీ నమోదైంది. ఉదయం షోలకు 6.28% ఆక్యుపెన్సీ ఉండగా, రాత్రి షోలకు అత్యధికంగా 13.96% నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ మ్యాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మించారు. 'స్త్రీ', 'స్త్రీ 2', 'భేదియా', 'ముంజ్యా' చిత్రాల తర్వాత మ్యాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో వచ్చిన ఐదో సినిమా ఇది. ఇందులో అలోక్ గోయల్ అనే జర్నలిస్టు పాత్రలో ఆయుష్మాన్ ఖురానా నటించగా, రక్తపిశాచి (వాంపైర్) అయిన తాడక పాత్రలో రష్మిక మందన్న కనిపించింది. వీరిద్దరి మధ్య నడిచే విభిన్నమైన ప్రేమకథే ఈ సినిమా.ఈ చిత్రం తన కెరీర్‌లోని అతిపెద్ద కమర్షియల్ హిట్స్‌లో ఒకటిగా నిలవడంపై హీరో ఆయుష్మాన్ ఖురానా ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ సినిమా పిల్లలను బాగా ఆకట్టుకోవడం తనను ఎంతగానో సంతోషపరిచిందని ఆయన అన్నారు. "థమ్మాలో నాకు బాగా నచ్చిన విషయం ఏంటంటే, ఇది పిల్లలకు నచ్చడం. నా కెరీర్‌లో పిల్లలు ఇష్టపడిన మొదటి సినిమా ఇదే. ఈ సినిమాలోని స్పెషల్ ఎఫెక్ట్స్, కథనం పిల్లలకు అనుకూలంగా ఉంటాయి. నా పిల్లలకు కూడా ఈ సినిమా బాగా నచ్చింది" అని తెలిపారు. ఈ చిత్రంలో పరేశ్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఫైసల్ మాలిక్, గీతా అగర్వాల్ శర్మ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు.





# బైకర్తో శర్వా మాస్టర్ ప్లాన్!

'చార్మింగ్ స్టార్' శర్వానంద్ చాలా కాలంగా ఒక సాలిడ్ హిట్ కోసం గట్టిగా ట్రై చేస్తున్నాడు. 'ఒకే ఒక జీవితం' పర్వాలేదనిపించినా, ఆయన రేంజ్‌కు తగ్గ బ్లాక్‌బస్టర్ మాత్రం ఇంకా పడలేదు. రొటీన్ కథలు, ఫ్యామిలీ డ్రామాలు వర్కవుట్ అవ్వకపోవడంతో, శర్వా ఈసారి రూట్ మార్చినట్లున్నాడు. తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, 'బైకర్' అనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌తో రాబోతున్నాడు.ఈ సినిమా కోసం శర్వా డెడికేషన్ నెక్ట్స్ లెవల్‌లో ఉంది. కేవలం కథ నచ్చి ఓకే చెప్పడమే కాదు, ఆ పాత్ర కోసం తనను తాను పూర్తిగా మార్చుకున్నాడు. 'బైకర్' లుక్ కోసం బరువు తగ్గి, చాలా లీన్‌గా తయారయ్యాడు. అంతేకాదు, ఇది రెగ్యులర్ యాక్షన్ కాదు, 'డర్ట్ బైక్ యాక్షన్' కావడంతో, ఏకంగా మూడు నెలల పాటు స్పెషల్ ట్రైనింగ్, డైట్, జిమ్‌తో కష్టపడ్డాడని సమాచారం.ఈ సినిమాతో అభిలాష్ రెడ్డి కంకర దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. యూవీ క్రియేషన్స్ లాంటి బడా సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటంతో, టెక్నికల్‌గా సినిమా చాలా రిచ్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com